


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 286, పేజీలు - 08

శుక్రవారం, ఏప్రిల్ 3, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## చంద్రుడి వద్దకు ఐఫోన్లతో వ్యోమగాములు

- చరిత్రలో తొలిసారిగా నాసా కీలక నిర్ణయం
- 50 ఏళ్ల తర్వాత మళ్ళీ చంద్రుడిపైకి మానవుడు



**ఫ్లోరిడా (ప్రశ్న న్యూస్)** అంతరిక్ష ప్రయోగాల్లో అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) మరో చారిత్రక మార్పుకు శ్రీకారం చుట్టింది. చరిత్రలో తొలిసారిగా, లోతైన అంతరిక్షంలోకి (డీప్ స్పేస్) వెళ్తున్న తమ వ్యోమగాములకు వ్యక్తిగత ఐఫోన్లు తీసుకువెళ్లేందుకు అనుమతి ఇచ్చింది. ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి గురువారం తెల్లవారుజామున 4:04 గంటలకు నింగిలోకి దూసుకెళ్లిన ఆర్టెమిస్–2 మిషన్‌లో ఈ కొత్త విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ మిషన్ ద్వారా మానవసహిత యాత్ర 50 ఏళ్లకు పైగా విరామం తర్వాత చంద్రుడి సమీపంలోకి వెళ్తోంది. రీడ్ వైస్‌మన్, విక్టర్ గ్లోవర్, క్రిస్టినా కోచ్, జెరెమీ హాన్సెన్‌లతో కూడిన నలుగురు

2లో..

# మాపై బాధ్యత మరింతగా పెరిగింది

- రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి కీలక సందేశం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్రమంతటా గ్రామ సభలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు కీలక సందేశం అందించారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం (కాంగ్రెస్ ప్రభుత్వం) బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాల మూడునెలలు పూర్తయ్యిందని రాష్ట్రంలోని ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ, గత పాలకుల తప్పిదాలను సరిచేస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీపడకుండా తమ ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. తాము పాలకులం కాదని, సేవకులం అన్న భావనతో ప్రజల ఆకాంక్షలు, అవసరాలే కేంద్ర బిందువుగా నిత్యం శ్రమిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతి నిర్ణయంలో ప్రజల మేలు, సామాజిక బాధ్యత, రాష్ట్ర భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో వరుస విజయాలతో ప్రజా పాలనకు ప్రజలు ఆమోదం, మద్దతు ప్రకటించారని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన ఈ ఫలితాలు తమ బాధ్యతను మరింత పెంచాయని అన్నారు. ప్రభుత్వ పథకాలు అంటే కాగితాలపై కాదని ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తేవాలన్నది తమ సంకల్పం అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆ ఉద్దేశంతోనే ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. మార్చి 6 నుండి 99 రోజుల పాటు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు, అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం ఒక ఉద్యమంలా సాగుతోందని తెలిపారు. ఊరు వాడ సమస్యల పరిష్కారమే పరమావధిగా ప్రతి అధికారి పని చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వేగంగా ఫైళ్ల క్లియరెన్స్, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత, నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలని సూచించారు. మహాలక్ష్మి – ఉచిత బస్సు సౌకర్యం, రూ. 500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు, మహిళా సాధికారత వంటి పథకాలు అర్హులకు చేరేలా ఈ కార్యక్రమం జరగాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. "తెలంగాణ రైజింగ్ – 2047" విజన్‌తో ఆర్థికంగానే కాకుండా, అన్నీ రంగాల్లో తెలంగాణను ప్రపంచంలో నంబర్ వన్‌గా నిలపాలనేది తమ సంకల్పమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సంకల్పంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పేర్కొన్నారు. రేర్, ప్యూర్, రేర్‌గా రాష్ట్రాన్ని వర్గీకరించుకున్నామని తెలిపారు. వాటి పరిధిలో సేవా, తయారీ,

2లో..

## మాల్దాలో న్యాయాధికారుల బందీ!

- సీజేఐ సీరియస్! దర్యాప్తుకు ఆదేశాలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి భారీ షాక్ తగిలింది. రాష్ట్రంలో ఈసీ ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణను సవాల్ చేస్తూ గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఆమెకు ఊరట దక్కలేదు. అదే సమయంలో రాష్ట్రంలో ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ పర్యవేక్షణ కోసం సుప్రీంకోర్టు న్యాయాధికారుల్ని నియమించింది. ఇప్పుడు తాజాగా మాల్దాలో ఏడుగురు న్యాయాధికారుల్ని మమత సర్కార్ బంధించడంతో సుప్రీం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మాల్దాలో ఏడుగురు న్యాయాధికారులను గంటల తరబడి బందీలుగా పట్టుకున్న దిగ్భ్రాంతికరమైన ఘటనపై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. ఇది తమ అధికారానికి సవాలు విసురుతోందని, పథకం ప్రకారం, ఉద్దేశపూర్వకంగా జరిగినట్లు

2లో..

# అమరావతికి చట్టబద్ధత.. రాజధానిలో సంబరాలు

- ఉద్దండరాయుని పాలెంలో రైతుల సభకు హాజరైన సీఎం చంద్రబాబు
- ఇది ప్రజాస్వామ్య గొప్పతనాన్ని చాటిన చారిత్రక రోజని వ్యాఖ్య
- అమరావతిని చంపాలనుకున్న వైసీపీ బాగుపడని తీవ్ర విమర్శలు
- శంకుస్థాపన ప్రదేశంలో మట్టి, జలాలకు సాష్టాంగ నమస్కారం చేసిన సీఎం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి చరిత్రలో మరో సువర్ణ అధ్యాయం లిఖించబడింది. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో సవరణ బిల్లు ఆమోదం పొందిన వేళ, రాజధాని ప్రాంతం సంబరాల్లో మునిగిపోయింది. ఈ చారిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు ఉద్దండరాయుని పాలెం చేరుకుని, రాజధాని రైతులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. తన సతీమణి భువనేశ్వరితో కలిసి అమరావతి శంకుస్థాపన శిలాఫలకాన్ని సీఎం చంద్రబాబు సందర్శించారు. నాడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెచ్చిన పవిత్ర మట్టి, యమునా నది జలాలు ఉంచిన వేదిక

2లో..

# రాజ్యసభలో పలికింది కిషన్ రెడ్డి, పలికించింది రేవంత్ రెడ్డి



- రాజ్యసభలో కిషన్ రెడ్డి పచ్చి అబద్దాలు చెప్పారన్న హరీష్
- ఏడు మండలాలను ఏపీకి కట్టబెట్టిన పాపంలో కిషన్ రెడ్డిది కీలక పాత్ర
- రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రచారాన్నే కిషన్ రెడ్డి ప్రస్తావించారన్న హరీష్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ ఆత్మగౌరవాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కించపరిచారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శించారు. విభజన చట్టానికి సవరణ తెచ్చి ఏడు మండలాలను అప్పగించిన ద్రోహం బీజేపీదేనని అన్నారు. రాజ్యసభలో కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై హరీష్ రావు మండిపడ్డారు. రాజ్యసభలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పచ్చి అబద్దాలతో, చరిత్ర వక్రీకరణలతో తన లోపలి వికృతత్వాన్ని బయట పెట్టుకున్నారని తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయక వెన్నుచూపి పారిపోయిన కిషన్ రెడ్డి నేడు పార్లమెంట్ సాక్షిగా మరోసారి ద్రోహానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఏడు మండలాలను ఏపీకి అప్పగించాలనేది విభజన చట్టంలో ఉందని కిషన్ రెడ్డి పేర్కొనడం చారిత్రక అవాస్తవమే

2లో..

## అమరావతి ఏకైక రాజధానిగా నిలిచింది

- ఇది ఐదు కోట్ల ఆంధ్రుల విజయమన్న పవన్ కళ్యాణ్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే కీలక బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం పొందింది. లోక్‌సభలో ఇప్పటికే ఆమోదం పొందిన ఈ బిల్లు, గురువారం పెద్దల సభలోనూ నెగ్గడంతో అమరావతికి రాజధానిగా తిరుగులేని చట్టపరమైన హోదా లభించింది. ఈ చారిత్రక పరిణామం పట్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ఐదు కోట్ల ఆంధ్రుల విజయమని, ప్రజల ఆత్మగౌరవ పునరుద్ధరణ అని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. "త్యాగాల పునాదుల నుంచి, ఆశలు మోసుకొచ్చిన కన్నీటి నుంచి, అనిశ్చితిని భరించిన నిశ్శబ్దం నుంచి అమరావతి నేడు కోట్లాది ప్రజల ఆశలను మోస్తూ గౌరవంగా నిలబడింది" అని భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. గత కొన్నేళ్లుగా రాజధాని ఉనికిపై సాగిన కుట్రలు, అపోహలు, న్యాయపరమైన చిక్కులను అధిగమించి, పార్లమెంట్ సాక్షిగా అమరావతి ఒక అజేయ శక్తిగా అవతరించిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఎట్టకేలకు న్యాయం జరిగిందని, ఈ విజయం ఎన్డీఏ ప్రభుత్వంపై చెక్కుచెదరని విశ్వాసం ఉంచిన ప్రతి పౌరుడిదని తెలిపారు. అమరావతి ఆత్మ రైతుల త్యాగంలోనే ఉందని పవన్ కల్యాణ్ స్పష్టం

2లో..

# ఏఐ కారణంగా ఉద్యోగ నష్టాలు




- మూడంచెల ప్రత్యేక చట్టం అవసరమన్న కవిత

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కృత్రిమ మేధ (ఏఐ–ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కారణంగా చాలామంది ఉద్యోగాలు పోతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక సూచన చేశారు. ఏఐ వల్ల జరుగుతున్న ఉద్యోగ నష్టాన్ని అధిగమించడానికి మూడంచెల ఒక ప్రత్యేక చట్టం అత్యవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ఒకటి జాతీయ, రాష్ట్రస్థాయి పర్యవేక్షణ యంత్రాంగం, రెండోది సామాజిక రక్షణ, పరిశ్రమ భాగస్వామ్యం మరియు నైపుణ్యాభివద్ధి పెంచడం ద్వారా ఏఐ ఆధారిత ఉద్యోగ నష్టాన్ని అధిగమించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఈ సూచనలతో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్, తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు కార్యాలయానికి ట్యాగ్ చేశారు.

2లో..

## మూసీ ప్రాజెక్టుకు తొలగిన అడ్డంకి

- ఎన్జీటీలో తెలంగాణ సర్కార్‌కు భారీ ఊరట



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వానికి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో బిగ్ రిలీఫ్ వచ్చింది. మూసీ నది పునరుజ్జీవం, సుందరీకరణ ప్రాజెక్టును సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేత పటోళ్ల కార్తిక్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ఎన్జీటీ రేవంత్ రెడ్డి సర్కార్‌కు ఊరటను ఇచ్చింది. దీంతో మూసీ ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎదురైన న్యాయపరమైన అడ్డంకి తొలగినట్లయింది. మూసీ ప్రక్షాళన కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ ప్రాజెక్టు వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని అక్కడ నిబంధనలకు విరుద్ధంగా ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని కార్తిక్ రెడ్డి ఎన్జీటీలో పిటిషన్ దాఖలు చేశారు. గాంధీ సరోవర్ ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘించారని పిటిషనర్ పటోళ్ల కార్తిక్ రెడ్డి పేర్కొన్నారు. అయితే రాజకీయ దురుద్దేశంతోనే పిటిషనర్ పిటిషన్ వేశారని రాష్ట్ర ప్రభుత్వం వాదనలు వినిపించింది. దీనిపై ఇరు పక్షాల వాదనలు విన్న ఎన్జీటీ విచారణ జరిపి పిటిషనర్ దాఖలు చేసిన పిటిషన్‌లో సరైన ఆధారాలు లేవని పేర్కొంటూ కేసును డిస్మిస్ చేసింది. పిటిషనర్ చేస్తున్న వాదనలకు సంబంధించి ఎలాంటి టెక్నికల్, శాస్త్రీయ ఆధారాలను సమర్పించలేదని ఎన్జీటీ తెలిపింది. కేవలం పిటిషనర్ పేర్కొంటున్న అనుమానాలతో మూసీ ప్రాజెక్టును అడ్డుకోలేమని తేల్చి చెప్పింది. అదే సమయంలో ఈ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ

2లో..

## రైతులకు అండగా, భూ ఆసాములకు భరోసా

- ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి

2లో..



## అమరావతి చట్టబద్ధత బిల్లుకు రాజ్యసభ ఆమోదం

- వాకౌట్ చేసిన వైసీపీ

2లో..



# చంద్రుడి వద్దకు ఐఫోన్లతో వ్యోమగాములు

వ్యోమగాముల బృందం, ఓరియన్ స్పేస్‌క్రాఫ్ట్‌లో 10 రోజుల పాటు చంద్రుడి చుట్టూ ప్రయాణించి తిరిగి రానుంది. ఈ ప్రయాణంలో తమ వ్యక్తిగత క్షణాలను, అద్భుతమైన దృశ్యాలను బంధించేందుకు వీరికి ఐఫోన్లను ఉపయోగించుకునే వెసులుబాటు కల్పించారు. వ్యోమగాములు వినియోగించే పరికరాలను ఆధునికీకరించే ప్రణాళికలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు నాసా అడ్మినిస్ట్రేటర్ జారెడ్ ఐజాక్‌మన్ ఈ ఏడాది ఆరంభంలో ప్రకటించారు. "మా వ్యోమగాములు తమ కుటుంబం కోసం ప్రత్యేక క్షణాలను బంధించుకోవడానికి, ప్రపంచంతో స్ఫూర్తిదాయకమైన చిత్రాలు, వీడియోలను పంచుకోవడానికి అవసరమైన సాధనాలను అందిస్తున్నాం" అని ఆయన గతంలో ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తెలిపారు. అయితే, అంతరిక్ష నౌకలోని వ్యవస్థలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు, డీప్ స్పేస్ ప్రయాణంలో ఈ ఫోన్లను పూర్తిగా 'ఏరోప్లేన్ మోడ్'లోనే ఉంచుతారు. అంటే ఇవి కేవలం హై-ఎండ్ కెమెరాలుగా మాత్రమే పనిచేస్తాయి. ప్రయాణ సమయంలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) మీదుగా వెళ్తున్నప్పుడు, అక్కడి వై-ఫైకి కనెక్ట్ అయి ఫోటోలు, ఈ-మెయిల్స్ పంపే అవకాశం ఉంటుంది. కానీ, వాయిస్ కాల్స్ చేసుకోవడం మాత్రం సాధ్యం కాదు. ఈ యాత్రలో వ్యోమగాములు చంద్రుడి ఉపరితలానికి సంబంధించిన లైవ్ చిత్రాలను తీయడంతో పాటు ఇంతకుముందు మానవ కంటికి కనిపించని కొన్ని ప్రదేశాలను గమనించనున్నారు. అలాగే, లోతైన అంతరిక్షం నుంచి పాక్షిక సూర్యగ్రహణాన్ని కూడా వీక్షించనున్నారు.

# మాపై బాధ్యత మరింతగా పెరిగింది

వ్యవసాయ రంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా ఎదగాలని చెప్పారు. ఈ 99 రోజుల కార్యాచరణ ఒక సాధారణ కార్యక్రమం కాదని ఒక దీక్ష అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 4 కోట్ల తెలంగాణ ప్రజలు ఒక్కటై దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా ఎదగాలని ఇదే తన కల అని ఆ కలను సాకారం చేయడంలో ప్రతి తెలంగాణ బిడ్డ భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఇందుకు అందరి సహకారాన్ని కోరుకుంటున్నానని తెలిపారు.

# మాల్దాలో న్యాయాధికారుల బందీ!

కనిపిస్తోందని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ఆక్షేపించారు. ఈ ఘటనపై సీబీఐ లేదా ఎన్ఐఏతో దర్యాప్తు జరిపించాలని భారత ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ దర్యాప్తును తామే పర్యవేక్షిస్తామని కూడా తెలిపింది. ఓటర్ల జాబితాల సవరణ సమయంలో ఇందులో నుంచి తమ పేర్లను తొలగించిన ఓటర్ల బృందం.. మాల్దాలో ముగ్గురు మహిళలతో సహా మొత్తం ఏడుగురు న్యాయాధికారులను తొమ్మిది గంటలకు పైగా బందీలుగా పట్టుకుంది. నిన్న మధ్యాహ్నం నుంచి తెల్లవారుజామున సుమారు 1 గంట వరకూ బందీలుగా ఉన్న వీరు.. భారీ సంఖ్యలో పోలీసులు, పారామిలిటరీ సిబ్బంది సాయంతో సురక్షిత ప్రాంతాలకు వెళ్లారు. సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న సమయంలోనూ వాహనాలపై దాడి చేసేందుకు కూడా ప్రయత్నం జరిగింది. పోలీసులు న్యాయాధికారులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తుండగా, పగిలిపోయిన కారు కిటికీ అద్దాలు, ఆగ్రహంతో ఉన్న నిరసనకారులు కార్లపై రాళ్లు విసురుతున్న దృశ్యాలు కనిపించాయి. సాయంత్రం 5 గంటలకు అధికారులను ముట్టడించారని, రాత్రి 11 గంటల వరకు వారికి సాయం అందలేదని సీజేఐ తెలిపారు. నిన్నటి ఘటనను రాజకీయ నాయకులందరూ ఏకగ్రీవంగా ఖండించాలని మరో న్యాయమూర్తి జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి కోరారు. తాము ప్రత్యేక అధికారులను రక్షించడానికే ఇక్కడ ఉన్నామని, వారి ఆదేశాలు తమ కోర్టు ఆదేశాలుగా పరిగణించబడతాయని తెలిపారు. ఈసీ ఎక్కడి నుంచైనా బలగాలను రప్పించి, న్యాయాధికారులను కాపాడాలన్నారు. ఈ ఘటన న్యాయాధికారులను బెదిరించడానికే కాక, ఈ కోర్టు అధికారాన్ని కూడా సవాలు చేసే ఒక బరితెగించిన ప్రయత్నం అన్నారు. న్యాయాధికారులకు అప్పగించిన పని సురక్షితంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది.

## రాజ్యసభలో పలికింది కిషన్ రెడ్డి, పలికించింది రేవంత్ రెడ్డి

కాదని, అది తెలంగాణకు చేస్తున్న తీరని ద్రోహం అని అన్నారు. విభజన చట్టానికి సవరణ తెచ్చి ఆర్డినెన్స్ ద్వారా ఏడు మండలాలను ఏపీకి కట్టబెట్టింది ముమ్మాటికి బీజేపీ ప్రభుత్వమేనని అన్నారు. ఈ పాపంలో కిషన్ రెడ్డికి కూడా పాత్ర ఉందని ఆరోపించారు. ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చి బీజేపీ చేసిన ద్రోహాన్ని ఎండగట్టిన విషయాన్ని మర్చిపోయి నేడు ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే అన్నట్లు చరిత్రను వక్రీకరిస్తున్నారని హరీష్ రావు విమర్శించారు. పార్లమెంట్ సాక్షిగా చరిత్ర వక్రీకరణకు పాల్పడి ఈరోజు తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించారని ఇది బీజేపీ కుట్రకు నిదర్శనమని ఆరోపణలు చేశారు. కాళేశ్వరంపై రేవంతు రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే నేడు కిషన్ రెడ్డి పార్లమెంట్ లో చేయడం కాంగ్రెస్, బీజేపీ చీకటి పొత్తుకు సాక్ష్యమని ఆరోపించారు.

ప్రపంచంలోనే అతి పెద్ద బహుళ దశల ఎత్తిపోతల ప్రాజెక్టుగా కాళేశ్వరం నిర్మించడం అబద్ధామా? అని ప్రశ్నించారు. 148 మీటర్ల దిగువ ప్రాంతం నుంచి 618 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోయడం అబద్ధామా? అని అడిగారు. ఈరోజు, ఈ నిమిషానికి మండుటెండల్లో సైతం కాళేశ్వరం ప్రాజెక్ట్ కాల్వల ద్వారా జలాలు రైతుల పొలాలకు చేరుతుండటం అబద్దమా? అని హరీష్ రావు ప్రశ్నించారు. పంట పొలాల్లో పారుతున్న కాళేశ్వరం జలాలను చూపించేందుకు తాను సిద్ధంగా ఉన్నాని తెలిపారు. వచ్చేందుకు వారికి దమ్ముందా? అని ప్రశ్నించారు. ఏ ప్రభుత్వం అయినా ప్రజా ధనంతోనే నిర్మాణాలు చేస్తుందని హరీష్ రావు అన్నారు. ఆ విషయం మరిచి కేసీఆర్ జేబులోంచి డబ్బు ఖర్చు పెట్టారా అని కిషన్ రెడ్డి అడగడం ఆయన అవివేకానికి, అతి తెలివికి నిదర్శనమని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం నిర్మిస్తున్న జాతీయ రహదార్లు, ప్రాజెక్టులకు వారి సొంత పైసలు ఖర్చు పెడుతున్నారా? అని ప్రశ్నించారు. "కాళేశ్వరం వల్ల ఉపయోగం లేదని గొంతు చించుకుంటున్నారు గతంలో మీ ప్రభుత్వ పెద్దలే నితిన్ గడ్కరీ నుంచి సీడబ్ల్యూసీ చైర్మన్ మసూద్ వరకు కాళేశ్వరంపై కురిపించిన ప్రశంసలు అబద్దం అంటారా? అవివేకం అంటారా?. ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా' (చాప్టర్ 8) రిపోర్ట్ ప్రకారం 2014లో తెలంగాణలో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం, 2023 నాటికి ఏకంగా 2.2 కోట్ల ఎకరాలకు పెరిగింది. దీనికి ప్రధాన కారణం కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ పథకాలే అని కుండబద్దలు కొట్టింది. ఇది మీ కళ్ళకు కనిపించడం లేదా? రేవంత్ చెప్పింది మాత్రమే చెవుల్లోకి వెళుతుందా?. పూటకో తీరు మాట్లాడటం రాజనీతి అనిపించుకోదు" అని హరీష్ రావు తీవ్ర విమర్శలు చేశారు. రాజ్యసభలో మాట్లాడింది కిషన్ రెడ్డి అయినా ఆయన చేత పలికించింది మాత్రం రేవంత్ రెడ్డి అని ఆరోపించారు.

# అమరావతికి చట్టబద్ధత..

వద్ద దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, దీప హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా భావోద్వేగానికి లోనైన ముఖ్యమంత్రి, ఆ పవిత్ర వేదికకు సాష్టాంగ ప్రణామం చేశారు. వేద పండితుల ఆశీర్వచనాల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ మరియు వేలాది మంది రైతులు పాల్గొన్నారు.

### అమరావతి చరిత్ర శాశ్వతం.. రైతుల త్యాగం అమరం!

అనంతరం జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు నాయుడు ప్రసంగిస్తూ, ఈ రోజు దేశ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లిఖించదగిన రోజని కొనియాడారు.

"అమరావతి అంటే కేవలం ఒక ప్రాంతం కాదు, అది ఆంధ్రుల ఆత్మగౌరవ చిహ్నం. అనేక కుట్రలను ఎదుర్కొని, ఐదేళ్ల చీకటి రోజులను దాటుకుని ఇవాళ ప్రజా రాజధానిని సాధించుకున్నాం. ఇది ప్రజా సంకల్పానికి దక్కిన విజయం" అని ప్రకటించారు. 29 వేల మంది రైతులు నమ్మకంతో ఇచ్చిన 33 వేల ఎకరాల భూమి వల్లే ఇవాళ రాజధానికి ఈ స్థాయి దక్కిందని, వారి త్యాగం శాశ్వతంగా నిలిచిపోతుందని కొనియాడారు.

### వైసీపీ విధ్వంసంపై నిప్పులు.. ప్రధానికి కృతజ్ఞతలు

గత ప్రభుత్వ తీరుపై ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ప్రజావేదిక విధ్వంసంతో మొదలుపెట్టి అమరావతిని స్మశానంగా మార్చాలని చూశారు. రాజధానితో మూడు ముక్కలాట ఆడి అడ్రస్ లేకుండా పోయారు. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తుంటే పార్లమెంటు నుంచి వాకౌట్ చేసిన వైసీపీని, ప్రజలే బ్లాక్ అవుట్ చేయాలి" అని పిలుపునిచ్చారు. అదే సమయంలో ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన ప్రధాని మోదీకి, హోం మంత్రి అమిత్ షాకు మరియు మద్దతు తెలిపిన అన్ని రాజకీయ పార్టీలకు చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు.

### ఉద్యమ వీరత్వం.. భవిష్యత్తు విజన్

రాజధాని కోసం మహిళలు, రైతులు చేసిన 1631 రోజుల పోరాటాన్ని చంద్రబాబు స్మరించుకున్నారు. నాడు తన సతీమణి భువనేశ్వరి ఉద్యమానికి మద్దతుగా తన చేతి గాజులను ఇచ్చారని, పవన్ కళ్యాణ్ ముళ్ల కంచెలు దాటుకుని వచ్చి రైతులకు అండగా నిలిచారని గుర్తు చేశారు. "అమరావతి అజేయం, అజరామరం. పార్లమెంటులో చేసిన ఈ చట్టాన్ని ఇక ఎవరూ మార్చలేరు.

ప్రజల సహకారంతో ప్రపంచంలోని అత్యుత్తమ అభివృద్ధి మోడల్స్‌ను అమరావతికి తెస్తాను. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతాన్ని సమానంగా అభివృద్ధి చేస్తా" అని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. "ఇప్పటి వరకు మన రాష్ట్రానికి సరైన అడ్రస్ లేదు, ఇప్పుడు అమరావతి రూపంలో మనకు శాశ్వత అడ్రస్ వచ్చింది" అని ప్రకటిస్తూ చంద్రబాబు తన ప్రసంగాన్ని ముగించారు.

# అమరావతి ఏకైక రాజధానిగా నిలిచింది

చేశారు. "33,000 ఎకరాలకు పైగా భూములను రైతులు బలవంతంగా ఇవ్వలేదు. భవిష్యత్‌పై, ఒక దార్శనికతపై నమ్మకంతో ఇచ్చారు. ఈ రోజు వారి నమ్మకాన్ని గౌరవించగలిగాం" అని పేర్కొన్నారు. ఈ చారిత్రక ఘట్టంలో రాష్ట్రానికి గుర్తింపు కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఆయన నివాళులు అర్పించారు. గత కొన్నేళ్లుగా అమరావతిని అనిశ్చితిలోకి నెట్టారని, విధానాలు మార్చి రైతులను మోసం చేశారని, ప్రజల ఆకాంక్షలను నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఆ అనిశ్చితికి తెరపడిందన్నారు. ఇది కేవలం రాజధాని పునరుద్ధరణ మాత్రమే కాదని, ప్రజల ఆత్మగౌరవ పునరుద్ధరణ అని పేర్కొన్నారు. స్పష్టమైన దార్శనికతతో అమరావతి అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ప్రతి కీలక సమయంలో రాష్ట్రానికి అండగా నిలిచిన ప్రధాని నరేంద్ర మోదీకి, ఎన్డీఏ ప్రభుత్వానికి, బిల్లుకు మద్దతిచ్చిన అన్ని రాజకీయ పార్టీలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై అమరావతి స్థిరత్వం, ప్రగతికి చిహ్నంగా, తరతరాలకు వారధిగా నిలిచే ప్రజల రాజధాని అవుతుందని పవన్ కల్యాణ్ ధీమా వ్యక్తం చేశారు.

# రైతులకు అండగా,భూ ఆసాములకు భరోసా

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తూ, గతంలోని లోపాలను సరిదిద్ది సామాన్యులకు, రైతులకు భూ భద్రత కల్పిస్తూ, సులభరతమైన సేవలను అందించాలనే లక్ష్యంతో ప్రజాప్రభుత్వం అడుగులు వేస్తోందని అన్నారు. భూ క్రయవిక్రయాల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు రూపొందించిన 'సమీకృత భూభారతి' పోర్టల్‌ను రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం విటాయిపల్లిలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ క్రమంలోనే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భూభారతి పోర్టల్ రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ సేవలను ఒకే గొడుగు కిందకు తెస్తూ నూతన ఇంటిగ్రేటెడ్ వ్యవస్థకు శ్రీకారం చుట్టినట్టుగా తెలిపారు. పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రవ్యాప్తంగా ఐదు మండలాల్లో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ సేవలను రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం విటాయిపల్లిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగమైన గ్రామసభ వేదికగా ప్రారంభించినట్టుగా తెలిపారు. ఆధార్ కార్డు తరహాలోనే ప్రతి భూయజమానికి వారి భూమికి ప్రత్యేకంగా భూధార్ నంబర్‌ను కేటాయిస్తారని తెలిపారు. దీనివల్ల భూమి వివరాల్లో పారదర్శకత పెరిగి అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని వివరించారు. ఇకపై భూమి రిజిస్ట్రేషన్ సమయంలో కేవలం డాక్యుమెంట్లు మాత్రమే కాదు, క్షేత్రస్థాయి కొలతలతో కూడిన మ్యాప్‌ను కూడ జత చేయడం జరుగుతుందని తెలిపారు. అమ్మేవారి నుంచి కొనేవారికి భూమిని కొలిచి అప్పగించే బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుందని తెలిపారు. పాతకాలపు గొలుసు పద్ధతులకు స్వస్తి పలికి, అంగుళం కూడా తేడా లేకుండా కొలతలు తీసే రోవర్ యంత్రాలను ఇప్పటికే అందుబాటులోకి తీసుకొచ్చనట్టుగా తెలిపారు. ఇందుకోసం 5,300 మంది లైసెన్స్డ్ సర్వేయర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, ప్రతి మండలానికి 6 నుంచి 7 మందిని కేటాయించామని తెలిపారు. రాష్ట్రంలో10.984 రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లు గా విభజించి జీపీవోలను నియమించామని చెప్పారు. కొత్త ఇంటిగ్రేటెడ్ పోర్టల్ లో ఆన్‌లైన్ ద్వారా భూ వివరాలను అప్‌లోడ్ చేస్తే చాలు 24 నుంచి 48 గంటల్లో సర్వేయర్ క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలిస్తారని తెలిపారు. వారం రోజుల్లో సర్వే ప్రక్రియ పూర్తవుతుందని డాక్యుమెంట్లు యజమానుల ఇంటి అడ్రస్‌కే నేరుగా చేరతాయని తెలిపారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి కూడా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో చర్యలు చేపట్టామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక జీఓను కూడా తీసుకొచ్చామని తెలిపారు. ఇకపై అమ్మిన వారి 'కన్సెంట్' కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా, కొనుగోలు చేసిన రైతుల స్వంత డిక్లరేషన్‌తో భూమి రిజిస్ట్రేషన్ అయ్యేలా నిబంధనలు సులభతరం చేసినట్టుగా చెప్పారు. గతంలో మున్సిపాలిటీలుగా మారిన గ్రామ పంచాయితీలకు ధరణిలో భూమి రిజిస్ట్రేషన్ సౌకర్యం ఉండేది కాదని భూభారతి ద్వారా ఈ అడ్డంకిని తొలగించి అన్ని ప్రాంతాల్లోనూ సేవలు అందుబాటులోకి తెచ్చామని వివరించారు. గతంలో ఉన్న లోపాలను సరిదిద్దుతూ మ్యాప్‌తో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు అందించడం ద్వారా దొంగ పాస్ బుక్కులు రద్దవుతాయని అన్నారు. నిజంగా భూమి ఉన్నవారికి పాస్ బుక్ వస్తుందని చెప్పారు. ఈ విధంగా మ్యాప్ లను అందించడం వల్ల భవిష్యత్‌లో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అమనగల్ మండలంతోపాటు కుసుమంచి, అశ్వరావుపేట, వట్‌పల్లి, కొస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభమైన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ సేవలను 45రోజుల తర్వాత అవసరమైన మార్పులు, చేర్పులతో 2వ దశలో జిల్లాకో మండలంలో ప్రారంభిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు.

# ఏఐ కారణంగా ఉద్యోగ నష్టాలు

### చేనేత కార్మికుల జీవితాలు అంధకారంలోకి నెట్టేసే కుట్ర

రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణలో చేనేతకారుల జీవితాలను అంధకారంలోకి నెట్టేసే కుట్రలు చేస్తోందని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉన్న విద్యాశాఖ ఆధ్వర్యంలోని యూనిఫామ్‌ల ఆర్డర్‌ను ఏకపక్షంగా రద్దు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆర్డర్లపై ఎంతోమంది చేనేత కార్మికులు ఆధారపడ్డారని, ఈ ప్రభుత్వం వారి పొట్ట కొట్టిందని విమర్శించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఇచ్చే రూ.105 కోట్ల విలువైన యూనిఫామ్‌ల ఆర్డర్ ద్వారా వేలాది మంది చేనేత కార్మికులకు ఉపాధి లభిస్తుంటుందని తెలిపారు. కానీ ఈసారి ఆర్డర్ రద్దు చేయడం దారుణమని అన్నారు.

సంక్షేమ శాఖలు, ఇతర డిపార్టుమెంట్లకు సంబంధించిన రూ.200 కోట్ల విలువైన దుప్పట్లు, ఇతర దుస్తుల పంపిణీకి సంబంధించిన ఆర్డర్‌ను సైతం టెస్కోకు ఇవ్వకపోవడం కార్మికులను సంక్షోభంలోకి నెట్టివేయడమేనని ధ్వజమెత్తారు. గడువు ముగిసినప్పటికీ టెస్కోకు ఆర్డర్లు ఇవ్వకుండా ఆ సంస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని అన్నారు. తమకు కావాల్సిన ప్రైవేటు వ్యక్తులకు ఈ ఆర్డర్లను ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. చేనేత కార్మికులకు అన్యాయం చేసే చర్యను వెంటనే ఉపసంహరించుకోవాలని లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

# మరావతి చట్టబద్ధత బిల్లుకు రాజ్యసభ ఆమోదం

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అమరావతి చట్టబద్ధత బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టపరమైన భరోసా కల్పిస్తూ ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టసవరణ బిల్లుకు రాజ్యసభలో కూడా ఆమోదం లభించింది. మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. ఇప్పటికే ఈ బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలిపింది. గురువారం రాజ్యసభలో చర్చ అనంతరం ఆమోదం తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి ఈ బిల్లుపై చర్చను ప్రారంభించారు. బిల్లుపై చర్చ సమయంలో వైసీపీ ఎంపీలు వాకౌట్ చేశారు. రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందిన అనంతరం రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఏపీ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అమరావతికి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీర్వాదం ఉంటుందని అన్నారు. కాగా, రాష్ట్రపతి ఆమోదం అనంతరం ఇది చట్టంగా మారనుంది. సభలో 11 పార్టీలకు చెందిన 17 మంది ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. పది పార్టీలకు చెందిన ఎంపీలు మద్దతిచ్చారు.

# మూసీ ప్రాజెక్టుకు తొలగిన అడ్డంకి

ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఆరోపించిన పిటిషనర్ వాటిని నిరూపించడంలో మాత్రం విఫలమయ్యారని ఎన్జీటీ అభిప్రాయం వ్యక్తం చేస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. హైదరాబాద్ నడిబొడ్డున మురుగు నీటితో ప్రవహిస్తున్న మూసీ నదిని దశలవారీగా అభివృద్ధి చేసి, సుందరీకరించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ దాదాపు రూ.50 వేల కోట్లు ఖర్చు చేయనుంది. దీనికి సంబంధించిన తొలి డీపీఆర్‌ను తీసుకొచ్చింది. మూసీ, ఈసా నదులు కలిసే సంగమం వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించింది. మూసీ నదిని లండన్‌లోని థేమ్స్ నది తరహాలో 55 కిలోమీటర్ల మేర సుందరీకరణ చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా ఈ ప్రాజెక్టును చేపట్టింది. తొలి దశలో మూసీ నది అభివృద్ధి పనులకు దాదాపు రూ.7 వేల కోట్లు అవసరమని ప్రభుత్వం అంచనా వేసింది. ఫేజ్-1 కింద 21 కిలోమీటర్ల మేర మూసీ నది ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నారు. హిమాయత్ సాగర్ నుంచి బాపూ ఘాట్ వరకు గండిపేట నుంచి బాపూ ఘాట్ వరకు గల ఈసా, మూసీ నదులు కలిసే చోటు వరకు అభివృద్ధి చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ ప్రణాళికలు రూపొందించింది.

# తెలంగాణలో 2 లక్షల కొత్త పెన్షన్లు

## - రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో కొత్త పెన్షన్ల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న లక్షలాది మందికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. చేయూత పథకం కింద కొత్తగా మరో 2 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా 2026-27 వార్షిక బడ్జెట్‌లో రూ.233 కోట్లను కేటాయించడంతో, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు రంగం సిద్ధమైంది. అయితే, ఇప్పటికే పేరుకుపోయిన లక్షలాది దరఖాస్తుల నుంచి అర్హులను గుర్తించడం అధికారులకు పెను సవాల్‌గా మారనుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేటగిరీలలో 42.23 లక్షల మంది నెలనెలా చేయూత పెన్షన్లు పొందుతున్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులు, హెచ్ఐవీ, బోదకాలు బాధితులకు నెలకు రూ.2,016 చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. దివ్యాంగులకు మాత్రం పెన్షన్‌ను రూ.4,016గా ఇస్తున్నారు. ఇప్పుడు ఈ జాబితాలోకి మరో 2 లక్షల మంది కొత్తగా చేరనున్నారు.

గత మూడేళ్లుగా బోదకాలు, డయాలసిస్ బాధితులకు తప్ప కొత్తగా ఎలాంటి పెన్షన్లు మంజూరు కాకపోవడంతో అర్హులైన వారు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 లక్షలకు పైగా దరఖాస్తులు ప్రభుత్వానికి చేరి పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల బడ్జెట్‌లో కొత్త పెన్షన్ల ప్రకటన వెలువడిన తర్వాత, ఫిబ్రవరి 20 నుంచి ప్రజావాణి వంటి కార్యక్రమాల ద్వారా దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు, గురువారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న గ్రామసభల్లో కూడా భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం ఆమోదించినవి 2 లక్షల పెన్షన్లు కాగా, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య 12 లక్షలు దాటింది. వీటిలో వృద్ధాప్య పింఛన్ కోసం 4 లక్షలు, వితంతు, ఒంటరి మహిళల కోటాలో 3.5 లక్షలు, గీత, చేనేత కార్మికుల విభాగంలో 3 లక్షలు, దివ్యాంగుల పింఛన్‌కు 72 వేల దరఖాస్తులు ఉన్నాయి. ఈ భారీ సంఖ్య నుంచి కేవలం 2 లక్షల మంది అత్యంత అర్హులను ఎంపిక చేసేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు త్వరలోనే పటిష్టమైన వడపోత కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడం ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారింది.

# రెండో చోట నామినేషన్ వేసిన విజయ్

## - తిరుచ్చిలో పొలిటికల్ హీట్



**చెన్నై (ప్రశ్న న్యూస్)** తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, ప్రముఖ నటుడు విజయ్ తన ఎన్నికల ప్రచారంలో దూకుడు పెంచారు. గురువారం ఆయన తిరుచ్చి తూర్పు నియోజకవర్గంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా భారీగా తరలివచ్చిన అభిమానులతో అక్కడ తీవ్ర కోలాహలం, కొంత గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో ఒక ఊహించని సంఘటన చోటుచేసుకుంది. విజయ్ కాన్వాయ్ నగరం గుండా వెళ్తుండగా, వందలాది మంది అభిమానులు పోలీసుల నియంత్రణను సైతం లెక్కచేయకుండా ఆయన వాహనాన్ని అనుసరించారు. ఈ తోపులాటలో కాన్వాయ్ పక్కన పరిగెడుతున్న ఓ మహిళ అదుపుతప్పి కిందపడిపోయారు. ఇది గమనించిన విజయ్ వెంటనే తన వాహనాన్ని ఆపి, కిందకు దిగి, గాయపడిన మహిళను వ్యక్తిగతంగా పరామర్శించారు. ఆమె క్షేమంగా ఉన్నారని నిర్ధారించుకున్న తర్వాతే తన పర్యటనను కొనసాగించారు. ఈ సంఘటనతో అక్కడ కాసేపు ఉద్విగ్న వాతావరణం ఏర్పడింది. అనంతరం, తిరుచ్చి తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ముత్తు మురుగేశ పాండియన్‌కు విజయ్ తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ ఎన్నికల్లో ఆయన రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే పెరంబలూరులో ఆయన నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ తర్వాత, విజయ్ దివంగత నేత ఎంజీ రామచంద్రన్ (ఎంజీఆర్) విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఫల్యాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కొన్ని ప్రాంతాల్లో ఎల్పీజీ సిలిండర్ల కొరత ఉందని, అన్ని కుటుంబాలకు సరఫరా సరిగా అందుతోందా అని ప్రశ్నించారు. ఇతర విషయాల కోసం ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, సిలిండర్ల సమస్యను పరిష్కరించడానికి ఎందుకు వెళ్లలేదని నిలదీశారు. విలాత్తికులంలో పాఠశాల బాలిక హత్య ఘటనను ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించారు. ప్రజలు తమ భద్రతపై భయంతో బతుకుతున్నారని, రాష్ట్రంలో రాజకీయ మార్పు అత్యవసరమని అన్నారు. అధికారంలో ఉన్న 'దుష్ట శక్తులను' ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రెండు నియోజకవర్గాల్లో పోటీ, ప్రభుత్వాలపై సూటి విమర్శలతో విజయ్ తమిళనాడు ఎన్నికల బరిలో కొత్త వేడిని పుట్టించారు.

# శ్రీ లక్ష్మీనరసింహస్వామికి తెప్పోత్సవం



**యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)** చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఘనంగా తెప్పోత్సవం నిర్వహించారు. ప్రధాన ఆలయం నుండి లక్ష్మీ నరసింహుడిని సేవపై కొండపైన విష్ణు పుష్కరిణి వద్దకు తీసుకువచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రాలు,మంగళ వాయిద్యాలు,పారాయణల నడుమ నయన మనోహరంగా విష్ణు పుష్కరిణి లో లక్ష్మీ నరసింహుడి ని తెప్ప లో విహరింపజేశారు. విష్ణు పుష్కరిణి తెప్ప లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశాడు లక్ష్మీ నరసింహుడు. శ్రీమన్నారాయణుని చేరడానికై సంసార సాగరాన్ని దాటడానికి భక్తి అనే నావని పట్టుకొని అవతలి ఒడ్డుకు చేరి ముక్తిని పొందుతామని సూచించేదే తెప్పోత్సవమని అర్చకులు తెప్పోత్సవ విశిష్టతను తెలిపారు. తెప్పోత్సవం లో ఆలయ ఈఓ భవాని శంకర్, ఆలయ అర్చకులు,వేద పండితులు,ఆలయ అధికారులు,ఆలయ సిబ్బంది,ఎస్పీఎఫ్ పోలీసులు, భక్తులు పాల్గొన్నారు.

## రైతుల దీక్ష, సీఎం దక్షతే

# అమరావతి: ఎమ్మెల్యే నసీర్

**అమరావతికి మద్దతుగా గుంటూరులో భారీ ర్యాలీ**



గుంటూరు (ప్రశ్న న్యూస్) అమరావతి రైతుల దీక్ష, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దక్షతే ఆంధ్రుల రాజధాని అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి చట్టబద్ధత కల్పిస్తూ లోక్ సభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందడంపై గురువారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో నగరంలోని హిమని సెంటర్ నుంచి బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ ఐలాండ్ వరకు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో జై అమరావతి.. జై చంద్రబాబు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఆంధ్రుల ఆత్మగౌరవ నినాదం అమరావతి అని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మూడు ముక్కలాటతో అమరావతి రాజధానిని ధ్వంసం చేసిందని మండిపడ్డారు. ఒకవైపు శ్మశానాలంటూ, మరోవైపు వేశ్యలంటూ రాజధానిని అవమానించారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దక్షతతో అమరావతి రాజధాని ప్రపంచ ఖ్యాతి పొందేలా రూపుదిద్దుకుంటుందని, ఇప్పుడు రాజధానికి చట్టబద్ధత రావడం శుభ పరిణామం పేర్కొన్నారు. అమరావతి రాజధానిలో క్వాంటం వ్యాలీ, ఐకానిక్ భవనాలు వంటి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని, సీడ్ యాక్సెస్ రోడ్లు, ఇన్నర్ రింగ్ రోడ్లు వంటి అభివృద్ధి పనులు త్వరితగతంగా సాగుతున్నాయని తెలిపారు. అమరావతి రాజధాని కేవలం ఒక ప్రాంతానికి చెందినది కాదని, రాష్ట్ర నలువైపులా ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ చైర్మన్ దేగల ప్రభాకర్ జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు బిజెపి జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తిరువులూరి పద్మావతి, కోట మీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్ర చరిత్రలో నేడు సువర్ణ అధ్యాయం

- ఆంధ్రుల రాజధాని ఇక ఎన్నటికీ అమరావతే
- అమరావతితో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తాం
- అమరావతి మహిళలపై అక్రమ కేసులు మోపి హింసించిన పాపం జగన్ కి ఊరికే పోదు
- ప్రజలు తిరగబడి బుద్ధి చెప్పినా అమరావతిపై వైసీపీ విషం చిమ్మడం మానలేదు
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



ఒంగోలు (ప్రశ్న న్యూస్) ఆంధ్రుల కలల రాజధాని ఎన్నటికీ అమరావతేనని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. గురువారం పార్లమెంట్ లో అమరావతికి చట్టబద్ధత బిల్లు ఆమోదంతో కొండపిలో మంత్రి డా.స్వామి ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకుని కూటమి నేతలు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. అనంతరం రాత్రి ఒంగోలులో జిల్లా ప్రజా ప్రతినిధులతో కలసి అమరావతికి మద్దతుగా కొవ్వొత్తుల ర్యాలీలో మంత్రి స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేడు రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయం. అమరావతి చట్ట బద్ధతకు కృషి చేసిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి కృతజ్ఞతలు. ఆంధ్రుల రాజధాని ఇక ఎన్నటికీ అమరావతే. అమరావతితో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తాం. అమరావతిపై చర్చ సమయంలో వైసీపీ ఎంపీలు సభను బాయికాట్ చేయడం వారి దుర్బుద్ధికి అద్దం పడుతోంది. వైసీపీ హయాంలో మూడు రాజధానుల పేరుతో అమరావతిని విచ్ఛిన్నం చేసేందుకు జగన్ కుట్రలు పన్నారు. నాడు జగన్ అమరావతి మహిళలపై అక్రమ కేసులు మోపి హింసించారు. ఈ పాపం జగన్ కి ఊరికే పోదు. ప్రజలు తిరగబడి బుద్ధి చెప్పినా అమరావతిపై వైసీపీ విషం చిమ్మడం మానలేదని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి మండిపడ్డారు.

## విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**- చేబ్రోలు మహాలక్ష్మి పుల్లయ్య నగరపాలక ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ**



గుంటూరు (ప్రశ్న న్యూస్ )పశ్చిమ నియోజకవర్గం స్తంభాలగరువు ప్రాంతంలో ఉన్న శ్రీమతి చేబ్రోలు మహాలక్ష్మి పుల్లయ్య నగరపాలక ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న విద్యా విధానం, మౌలిక వసతులు, పరిశుభ్రత వంటి అంశాలను ఎమ్మెల్యే సమీక్షించారు. విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని స్వయంగా పరిశీలిస్తూ, పిల్లలతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను తెలుసుకున్నారు.అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడిన ఎమ్మెల్యే, వారి చదువు, సౌకర్యాలు, ఎదుర్కొంటున్న ఇబ్బందులు అవసరాల గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చెప్పిన సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.పాఠశాలల్లో మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు బలోపేతం కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, స్థానిక నాయకులు అధికారులు పాల్గొన్నారు.

# అందరి టార్గెట్ ట్రబుల్ షూటర్

## - హరీష్ రావు చుట్టూ జరుగుతున్న రాజకీయం.?

**(జె. సతీష్ - ప్రశ్న న్యూస్)**



తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు మాజీ మంత్రి హరీష్ రావు చుట్టూ తిరుగుతున్నాయి. నిన్నటి వరకు కేటీఆర్, కవితలపైనే విమర్శనాస్త్రాలు సంధించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు తన రూటు మార్చి హరీష్ రావును టార్గెట్ చేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా హరీష్ రావుపై భూకబ్జా ఆరోపణలు చేయడం, వ్యక్తిగత విమర్శలకు దిగడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహమే ఉందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

### భూకబ్జా ఆరోపణలు.. వ్యక్తిగత విమర్శల పర్వం!

రేవంత్ రెడ్డి నేరుగా పేరు ఎత్తకపోయినా, హరీష్ రావును ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా కలకలం రేపాయి. ముఖ్యంగా కన్న తండ్రిని పట్టించుకోని వారు ప్రజలను ఏం పట్టించుకుంటారు అనే అర్థం వచ్చేలా రేవంత్ చేసిన ఆరోపణలు హరీష్ రావును తీవ్రంగా ఇబ్బంది పెట్టేవిగా ఉన్నాయి. రాజకీయాల్లో ట్రబుల్ షూటర్‌గా పేరున్న హరీష్ రావుపై ఇలాంటి వ్యక్తిగత , అవినీతి ఆరోపణలు రావడం ఆయన ఇమేజ్‌కు పెద్ద సవాల్‌గా మారింది. ప్రభుత్వం ఇప్పటికే హరీష్ అనుచరులు, ఆయనకు సంబంధించిన భూ వ్యవహారాలపై విచారణకు ఆదేశించడం ఆయనను మరింత ఒత్తిడిలోకి నెట్టింది.

### బీజేపీ అస్త్రాన్ని వాడుకుంటున్న రేవంత్ రెడ్డి?

ఈ పరిణామాల మధ్య కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు కొత్త ట్విస్ట్‌ను ఇచ్చాయి. రేవంత్ రెడ్డి కావాలనే హరీష్ రావును ఒంటరిని చేస్తున్నారని, కేటీఆర్ మరియు కవితలతో రేవంత్ కున్న రహస్య ఒప్పందంలో భాగంగానే ఈ వ్యూహం నడుస్తోందని సంజయ్ ఆరోపించారు. అంటే, బీఆర్ఎస్ పార్టీని హరీష్ రావు చేతుల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడానికి, కల్వకుంట్ల కుటుంబంలోని అంతర్గత విభేదాలను రేవంత్ తనకు అనుకూలంగా మార్చుకుంటున్నారన్నది బీజేపీ వాదన. ఈ ఆరోపణల్లో నిజమెంత ఉన్నా, రేవంత్ రెడ్డి ఒక్కసారిగా హరీష్ పై పడటం వెనుక బీఆర్ఎస్ కేడర్‌ను గందరగోళానికి గురిచేసే ప్లాన్ స్పష్టంగా కనిపిస్తోంది.

### హరీష్ రావు చుట్టూ బిగుస్తున్న ఉచ్చు!

ప్రస్తుతానికి పరిస్థితులు హరీష్ రావుకు వ్యతిరేకంగా మారుతున్నట్లు కనిపిస్తున్నాయి. అటు ప్రభుత్వపరంగా విచారణలు, ఇటు రాజకీయంగా సొంత పార్టీలోనే ప్రాధాన్యత తగ్గిపోతోందన్న ప్రచారం ఆయనను ఆత్మరక్షణలో పడేశాయి. కేటీఆర్ అమెరికా పర్యటనలో ఉన్న సమయంలోనే హరీష్ రావుపై ఈ స్థాయిలో దాడులు జరగడం యాదృచ్ఛికం కాదని రాజకీయ పండితులు భావిస్తున్నారు. హరీష్ రావుకు ఉన్న మాస్ ఇమేజ్‌ను దెబ్బతీయడం ద్వారా బీఆర్ఎస్‌ను బలహీనపరచవచ్చని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు.

### ట్రబుల్ షూటర్ ముందున్న సవాల్

ఎన్నికల సమయంలో లేదా పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు సంక్షోభాలను చక్కదిద్దే హరీష్ రావు, ఇప్పుడు తన సొంత రాజకీయ ఉనికిని కాపాడుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. రేవంత్ రెడ్డి విసురుతున్న సవాళ్లను ఆయన ఎలా ఎదుర్కొంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే హరీష్ రావు తనపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ, ప్రభుత్వం వద్ద ఆధారాలు ఉంటే బయటపెట్టాలని సవాల్ విసిరారు.ద

కానీ, అటు కాంగ్రెస్ ప్రభుత్వం, ఇటు బీజేపీ నేతల విమర్శల మధ్య ఆయన తన పట్టును ఎలా నిలుపుకుంటారో చూడాలి.రేవంత్ రెడ్డి వర్సెస్ హరీష్ రావు పోరు రాబోయే రోజుల్లో మరింత ముదిరే అవకాశం ఉంది. ఒకవైపు ప్రజా సమస్యలపై పోరాడుతూనే, మరోవైపు తనపై వస్తున్న అవినీతి మరకలను తొలగించుకోవాల్సిన బాధ్యత హరీష్ పై ఉంది. రేవంత్ రెడ్డి చేస్తున్న ఈ మైండ్ గేమ్ ' బీఆర్ఎస్‌లో చీలిక తెస్తుందా లేక హరీష్ రావును మరింత బలమైన నేతగా మారుస్తుందా అనేది కాలమే నిర్ణయించాలి.

# బీజేపీ పార్టీలో అసంతృప్తి జ్వాలలు

**కష్టపడ్డ వారిని కాదని కొత్త వారికి ఛాన్స్?**

**పారాషూట్ నాయకులకు చెక్ పెట్టాలి, నిజమైన కార్యకర్తలను గుర్తించండి**

**జెండా మోయనివారికి పదవులెలా ఇస్తారు.**

**వెంకట్ రెడ్డి నగర్‌లో బీజేపీ అంతర్గత కలకలం..**

**పార్టీ జెండా మోసే కార్యకర్తలకు పార్టీ పదవి ఇవ్వండి**

**క్రమశిక్షణ గల కార్యకర్తలకు బాధ్యత అప్పగించండి**

**పార్టీకి కష్టం చేసిన వారికే గౌరవం ఇవ్వాలి... కార్యకర్తల హెచ్చరిక**

ఉప్పల్ (ప్రశ్న న్యూస్) గ్రేటర్ మల్కాజిగిరి జిల్లా పరిధిలో కొత్తగా ఏర్పడిన వెంకట్ రెడ్డి నగర్ డివిజన్‌లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధ్యక్ష ఎన్నికలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రానున్న గ్రేటర్ ఎన్నికల దృష్ట్యా ఈ పదవికి ప్రాధాన్యం పెరగడంతో, పార్టీలో అంతర్గతంగా తీవ్ర పోటీ నెలకొంది.పార్టీకి అంకితభావంతో పని చేసిన క్రమశిక్షణ గల కార్యకర్తలకు కాకుండా, ఇటీవలే పార్టీలో చేరిన నాయకులకు లేదా ఒక వ్యక్తి ఆధారంగా రాజకీయాలు చేసే వారికి అధ్యక్ష పదవి ఇవ్వాలని ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్టీ జెండా మోయని పారాషూట్ నాయకులకు పదవులు ఇవ్వడం ఎంతవరకు సమంజసం? అని సీనియర్ నాయకులు ప్రశ్నిస్తున్నారు.గత కార్పొరేషన్ ఎన్నికల్లో హబ్సిగూడ డివిజన్‌లో బీజేపీ అభ్యర్థి విజయంలో కీలక పాత్ర పోషించిన నాయకులను పక్కనపెట్టి, పార్టీ సిద్ధాంతాలు సరిగా తెలియని కొత్త నాయకులు అధ్యక్ష పోటీలో ఉండడం కార్యకర్తల్లో అసంతృప్తిని పెంచుతోంది. పార్టీలో ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తున్న వారికి అవకాశాలు ఇవ్వకపోవడం వల్ల వారి మనోభావాలు దెబ్బతింటాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు, అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ అభ్యర్థి ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్‌కు వ్యతిరేకంగా ఇతర పార్టీలకు మద్దతు ఇచ్చిన నాయకులు కూడా ఇప్పుడు పార్టీ పదవుల కోసం ప్రయత్నించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఒక పార్టీలో ఉంటూ మరో పార్టీకి వత్తాసు పలికే నాయకులను ప్రోత్సహిస్తే పార్టీ బలహీనపడుతుంది అని కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు.యువతకు అవకాశాలు కల్పించాలన్న డిమాండ్ కూడా బలంగా వినిపిస్తోంది. రానున్న గ్రేటర్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రజల్లో పనిచేసే యువ నాయకత్వాన్ని ముందుకు తీసుకురావాలని, ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి కృషి చేసే వారికే బాధ్యతలు అప్పగించాలని పార్టీ వర్గాలు కోరుతున్నాయి.డబ్బులు ఉన్న నాయకుడికి ఒక లెక్క, డబ్బులేని నాయకుడికి మరో లెక్క అనే విధానం ఉండకూడదు. బీజేపీ సిద్ధాంతం కష్టం చేసిన వారిని గౌరవించడం అని కార్యకర్తలు స్పష్టం చేస్తున్నారు. ఆర్థిక స్తోమత ఆధారంగా కాకుండా, పార్టీకి చేసిన సేవలు, నిబద్ధత ఆధారంగా పదవులు ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు.మొత్తానికి వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్ష ఎన్నికలు కేవలం ఒక పదవి కోసం పోటీ కాకుండా, పార్టీ విలువలు, క్రమశిక్షణ, మరియు కార్యకర్తల గౌరవానికి సంబంధించిన పరీక్షగా మారాయి. అధిష్ఠానం ఈ అంశాలను పరిగణలోకి తీసుకుని, పార్టీకి నిస్వార్థంగా సేవ చేసిన నాయకుడిని ఎంపిక చేస్తుందా లేదా అన్నది ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. పదవులు ఉన్నా లేకున్నా పార్టీని నమ్ముకుని పార్టీ పిలుపుమేరకు ప్రతి కార్యక్రమంలో పాల్గొంటున్న నాయకులను గుర్తించి పదవిని అప్పజెప్పాలని బిజెపి నాయకులు అధిష్టానాన్ని కోరుచున్నారు.

# జిల్లా వ్యాప్తంగా అంబరాన్నంటిన అమరావతి సంబరాలు

**అమరావతికి చట్టబద్ధత కల్పించడంపై సర్వత్రా హర్షం**

**జై అమరావతి అంటూ ర్యాలీలు నిర్వహించిన యువత**

**పాఠశాలల్లో కేక్ కట్ చేసి అమరావతికి జేజేలు పలికిన విద్యార్థులు**

**రంగవల్లులు వేసి దీపాలతో అమరావతిని స్వాగతించిన మహిళా లోకం**






నెల్లూరు(ప్రశ్న న్యూస్) జిల్లావ్యాప్తంగా అమరావతి సంబరాలు అంబరాన్నంటాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి శాశ్వత రాజధానికిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ భారత లోక్‌సభ, రాజ్యసభలు ఆమోదముద్ర వేసిన శుభసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ జిల్లావ్యాప్తంగా యువత, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, ప్రముఖులు గురువారం తమ ఆనందోత్సాహాలను వ్యక్తపరిచారు. జిల్లావ్యాప్తంగా విద్యాసంస్థల్లో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. యువత ఆనందంతో రాష్ట్ర చరిత్రలో ఇది ఒక చారిత్రాత్మకరోజు అని, రాష్ట్ర చరిత్రలో నూతన శకానికి పునాది పడిందని, అభివృద్ధికి అడుగులు చిరస్థాయిగా పడ్డాయని జై అమరావతి జైజై అమరావతి అంటూ ప్రదర్శనలు, బైక్ ర్యాలీలతో హోరెత్తించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ ప్రముఖులు తమ సంతోషాన్ని పంచుకున్నారు. దేవతల రాజధాని మన రాష్ట్రానికి శాశ్వత రాజధానిగా చరిత్ర గర్వించేవిధంగా ప్రభుత్వాలు చట్టబద్ధత కల్పించడం యావత్ ప్రపంచంలోని తెలుగుప్రజల విజయంగా వర్ణిస్తూ మహిళలందరూ తమ ఇళ్ల ముందు రంగవల్లులతో, విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించి తమ కుటుంబసభ్యులతో సెల్ఫీలు దిగి అమరావతి ఆనందాన్ని పంచుకున్నారు. నెల్లూరు నగరంలోని వి ఆర్ సి నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మైపాడు గేట్ సెంటర్ స్మార్ట్ స్ట్రీట్ బజార్ వద్ద మెప్మా ఆధ్వర్యంలో మహిళలు ముగ్గులు వేసి దీపాలు వెలిగించి తమ సంతోషం వ్యక్తం చేశారు.

# భయాలను జయించి ధర్మం వైపు సాగుదాం

- నిస్వార్థ సేవ,సహనం మన జీవన విధానం కావాలి
- భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత : పిన్నింటి హనుమాండ్లు
- ప్రజలందరికీ "హనుమాన్ జయంతి శుభాకాంక్షలు

తెలిపిన హనుమాండ్లు



వేములవాడ (ప్రశ్న న్యూస్) హనుమాన్ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు పిన్నింటి హనుమాండ్లు ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అచంచలమైన భక్తి, అపారమైన శక్తి, అజేయమైన ధైర్యానికి ప్రతీకగా నిలిచే భగవాన్ శ్రీ హనుమంతుడు ప్రతి హృదయంలో వెలుగొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హనుమంతుడిలా ధైర్యసాహసాలతో, నిస్వార్థ సేవాభావంతో, అపార సహనంతో జీవించాలని సూచించారు. మనిషిలోని భయాలను జయించి, సత్యం మరియు ధర్మమార్గంలో ముందుకు సాగేందుకు హనుమంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ మనతో ఉండాలని ఆకాంక్షించారు.

# వినియోగదారుల ప్రతి సమస్య తీరాలి


- మంత్రి నాదెండ్ల మనోహర్

గ్యాస్ సమస్యలను సున్నితంగా పరిష్కరించాలి

వినియోగదారుల సేవా కేంద్రంలోని

1967 కాల్ సెంటర్ ను పరిశీలించిన మంత్రి

వినియోగదారుల సమస్యలపై ఆరా



తెనాలి (ప్రశ్న న్యూస్) అంతర్జాతీయ యుద్ధ పరిణామాల నేపథ్యంలో ప్రజల్లో నెలకొన్న గ్యాస్ సరఫరా భయాలకు తోడు, క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి అందుతున్న ఫోన్ ఫిర్యాదులను రాష్ట్ర వినియోగదారుల సర్వీస్ సెంటర్ నుంచి రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం పర్యవేక్షించారు. పౌర సరఫరాల శాఖ రాష్ట్ర కార్యాలయంలోని వినియోగదారుల సేవా కేంద్రాన్ని ఆయన స్వయంగా పరిశీలించి, ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను తెలుసుకున్నారు. 1967 టోల్ ఫ్రీ నంబరు కు ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు ఏమిటి ? దానిలో ఎన్ని పరిష్కరించారు ? ఎన్ని పెండింగ్ ఉన్నాయి. అత్యధికంగా వస్తున్న ఫిర్యాదులేమిటి..? అన్న విషయాన్ని కాల్ సెంటర్ సమన్వయకర్తలను అడిగి తెలుసుకున్నారు.
ప్రజలతో కాల్ సెంటర్ సిబ్బంది వ్యవహరిస్తున్న తీరును గమనించారు. ప్రజలకు ఓర్పుగా, హుందాగా సమాధానం చెప్పాలని, ప్రజలు తమ సమస్యలు చెబితే వాటిని పరిష్కరించే సూచనలు చేయాలని చెప్పారు. వినియోగదారులు కాల్ చేసినందుకు సమస్య పరిష్కారం అయి, సంతోషంగా ఉండాలన్నారు. ఏప్రిల్ 1వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా వినియోగదారుల సేవా కేంద్రానికి వచ్చిన 465 ఫోన్ కాల్స్ లో గ్యాస్ బుకింగ్ సమాచారం కోసం 144 కాల్స్ మాత్రమే వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇది మార్చి రెండోవారం కాల్స్ తో పోలిస్తే గణనీయంగా తగ్గినట్లు అధికారులు మంత్రి కి తెలియజేశారు. గ్యాస్ సరఫరా లోపాలు క్షేత్రస్థాయిలో క్రమంగా తొలిగిపోతున్నాయని, సరఫరా చైన్ క్రమబద్ధీకరణ వేగంగా జరుగుతోందని మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ తెలిపారు. గ్యాస్ సరఫరా విషయంలో ప్రజల్లో అవగాహన పెరుగుతోందని చెప్పారు. ఓటీపీ సమస్యలు, ఏజెన్సీల మాయాజాలం, బుకింగ్, డెలివరీల్లో ఇబ్బందుల మీద ప్రధానంగా దృష్టి సారించాలని మంత్రి అధికారులకు సూచించారు. వినియోగదారులు ఏ మాత్రం ఇబ్బంది పడకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా ఫిర్యాదులను నిరంతరం సమీక్షిస్తామని స్పష్టం చేశారు.

# అమరావతి నినాదాలతో హోరెత్తిన గుంటూరు పశ్చిమ నియోజకవర్గం

ఎమ్మెల్యే గల్లా మాధవి ఆధ్వర్యంలో భారీ ద్విచక్ర ర్యాలీ

రాజధానికి పట్టిన గ్రహణం వీడిందంటూ దీపాలు వెలిగించిన పార్టీ నేతలు



గుంటూరు (ప్రశ్న న్యూస్) అమరావతి రాజధానికి చట్టబద్ధత లభించిన సందర్భంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఎమ్మెల్యే గల్లా మాధవి ఆధ్వర్యంలో భారీ ద్విచక్ర ర్యాలీ నిర్వహించగా, "జై అమరావతి" నినాదాలతో ప్రాంతం మార్మోగింది. లాడ్జి సెంటర్ నుంచి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు భారీగా ర్యాలీ సాగింది. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులు అర్పించారు. అనంతరం బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకుంటూ సంబరాలు జరుపుకున్నారు.రాజధానికి పట్టిన గ్రహణం వీడిందని పేర్కొంటూ ఎమ్మెల్యే గల్లా మాధవి, గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాస్ తదితర పార్టీ నేతలతో కలిసి దీపాలు వెలిగించి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూఅమరావతి రాజధాని చట్టబద్ధత సాధన ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ చారిత్రాత్మక ఘట్టమని ఎమ్మెల్యే గల్లా మాధవి పేర్కొన్నారు. పార్లమెంట్ సాక్షిగా అమరావతిని రాజధానిగా ఆమోదించడం ప్రతి ఆంధ్రుడికి గర్వకారణమన్నారు.
ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నేతలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు పథకంతో నిరుపేదల "ఇల్లు" కల సాకారం

- చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం కృషితో లబ్ధిదారులకు నెరవేరిన సొంతింటి కల
- నాయకుల హాజరు - లబ్ధిదారులకు శుభాకాంక్షలు
- కాంగ్రెస్ పార్టీ నేతలు
- వన్నెల రమణారెడ్డి - కొలుపుల ప్రవీణ్





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, బూరుగుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు పథకంలో భాగంగా నిర్మాణం పూర్తయి, ఇంటి గృహప్రవేశ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించబడ్డాయి. గ్రామానికి చెందిన శ్రీపతి దేవయ్య, బోయిని మహేష్ -- అంజలి లబ్ధిదారులు ఈ కార్యక్రమాన్ని ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, మండల యువ నాయకుడు కొలుపుల ప్రవీణ్ హాజరై,మాట్లాడుతూ, "ప్రతి పేద కుటుంబం సొంత ఇంటి కలను నిజం చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోంది. ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా నిజమైన లబ్ధిదారులకు ఇళ్లు అందించడం జరుగుతోంది. ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు గ్రామీణ అభివృద్ధికి బలంగా నిలుస్తాయి" అని పేర్కొన్నారు. అలాగే, భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. లబ్ధిదారులు కొత్త ఇంట్లో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కల్లెపల్లి చంద్రయ్య, వార్డు సభ్యులు కొలుపుల మల్లేశం, అక్కరాజు తిరుపతి, నాయకులు కల్లెపల్లి శంకర్, సురుగు నాంపల్లి, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# బొల్లారంలో ఘనంగా మాజీ సర్పంచ్ మల్లేశం లావణ్య దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు

- సేవా దంపతులకు ఘన సన్మానం - పవర్ యూత్ ఆధ్వర్యంలో వేడుకలు - శుభాకాంక్షలు





వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ రూరల్ మండలం, బొల్లారం గ్రామ మాజీ సర్పంచ్ ఇరువాల మల్లేశం -- లావణ్య దంపతుల పెళ్లిరోజు వేడుకలను పురస్కరించుకొని గురువారం "పవర్ యూత్" ఆధ్వర్యంలో కేక్ కట్ చేయించి, మిఠాయిలు పంచి,ఘనంగా వేడుకలు నిర్వహించి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా, పవర్ యూత్ సభ్యులు మాట్లాడుతూ...గ్రామ అభివృద్ధికి మల్లేశం చేసిన సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ఆయన నాయకత్వంలో బొల్లారం గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని తెలిపారు. సామాజిక సేవలో ఎల్లప్పుడూ ముందుండే ఈ దంపతులు యువతకు ప్రేరణగా నిలుస్తున్నారని అన్నారు. మల్లేశం - లావణ్య దంపతులు ఇలాగే ఆనందంగా, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ, వారి కుటుంబం మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నామని తెలిపారు. గ్రామ ప్రజల మన్ననలు పొందిన ఈ దంపతులు భవిష్యత్తులో కూడా సమాజ సేవలో ముందుండాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# చారిత్రక కోనేరును పట్టించుకునే వారెవరు. ?

అభిషేకానికి నోచుకోని పవిత్ర జలాలు

డైమండ్ కటింగ్ మెట్లు.. అపురూప కట్టడం

పునరుద్ధరించాలని భక్తుల డిమాండ్





మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) ఆధ్యాత్మికతకు నిలయమైన మేడ్చల్ రామలింగేశ్వర స్వామి ఆలయ కోనేరు నేడు ఆదరణకు నోచుకోక పిచ్చిమొక్కలు, నాచుతో నిండిపోయి దర్శనమిస్తోంది. ఒకప్పుడు స్వామివారి అభిషేకానికి పవిత్ర జలాలను అందించిన ఈ కోనేరు, ప్రస్తుతం చెత్తాచెదారానికి నిలయంగా మారడంపై భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అభిషేకానికి నోచుకోని పవిత్ర జలాలు..

స్థల పురాణం ప్రకారం ఈ కోనేరుకు ఎంతో విశిష్టత ఉంది. గతంలో ఆలయ అర్చకులు ఈ కోనేరు నుంచి జలాలను తీసుకువెళ్లి స్వామివారికి అభిషేకం నిర్వహించేవారు. కానీ సరైన నిర్వహణ లేకపోవడంతో నీరు పూర్తిగా కలుషితమైపోయింది. పాచి పేరుకుపోవడంతో నీరు కంటికి కనిపించని స్థితికి చేరుకుంది. కోనేరు మెట్లు సైతం శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

## డైమండ్ కటింగ్ మెట్లు.. అపురూప కట్టడం

చారిత్రక శైలిలో నిర్మించిన ఈ కోనేరు మెట్లు రాతి కట్టడం నాటి ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిదర్శనం. అయితే, కోనేరు చుట్టూ పిచ్చిమొక్కలు మొలవడం, వ్యర్థాలు పేరుకుపోవడంతో ఈ కట్టడం క్రమంగా తన ఉనికిని కోల్పోతోంది. భక్తులు కోనేరు దరిదాపుల్లోకి వెళ్లడానికే భయపడే పరిస్థితి నెలకొంది.

## పునరుద్ధరించాలని భక్తుల డిమాండ్..

రామలింగేశ్వర గుట్ట అభివృద్ధి చెందుతున్నప్పటికీ, దాని అనుబంధంగా ఉన్న ఈ కోనేరును విస్మరించడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే కోనేరులోని చెత్తను తొలగించి, నీటిని శుద్ధి చేయాలని మేడ్చల్ పట్టణ ప్రజలు కోరుతున్నారు. శిథిలమవుతున్న మెట్లకు మరమ్మతులు చేపట్టి, భక్తులు దిగడానికి వీలుగా తీర్చిదిద్దాలని కోనేరు చుట్టూ రక్షణ చర్యలు చేపట్టి, పర్యాటక ప్రాంతంగా మార్చాలని భక్తులు, ప్రజలు కోరుతున్నారు.

# మృత్యువుతో పోరాడే 'మౌన శంఖారావం'

108 ఈఎంటీల అంకితభావానికి ప్రణామం

గర్భాశయంగా మారిన 108 అత్యవసర అంబులెన్స్

కరోనా కాలపు కన్నీటి వీరులు

ఈఎంటీలకు సమాజం ఇవ్వాల్సిన గౌరవం

మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) రాత్రి పగలు తేడా లేదు.. ఎండ వాన అనే అడ్డు లేదు. ఒక్క ఫోన్ కాల్ వస్తే చాలు, నిమిషాల్లో బాధితుడి వద్దకు చేరుకుని మృత్యువు కౌగిలి నుండి ప్రాణాన్ని లాగేసుకొచ్చే "అపర ధన్వంతరులు" వారు. నేడు జాతీయ 108 ఈఎంటి దినోత్సవం. ఈ సందర్భంగా కేవలం ఒక వాహనంగా కాకుండా ఒక 'మొబైల్ హాస్పిటల్'గా సేవలు అందిస్తున్న 108 సిబ్బంది జీవన యానంపై "ప్రజాప్రశ్న" దినపత్రిక ప్రత్యేక విశ్లేషణ.

## గోల్డెన్ అవర్..

మృత్యువుకు, జీవనానికి మధ్య ఒక గంట పోరాటం వైద్య శాస్త్రంలో 'గోల్డెన్ అవర్' అత్యంత కీలకం. ప్రమాదం జరిగిన మొదటి 60 నిమిషాల్లో బాధితుడికి అందే ప్రాథమిక చికిత్స ఆ వ్యక్తి బ్రతికే అవకాశాలను 80% పెంచుతుంది. ఈ అత్యంత క్లిష్ట సమయంలో 108 ఈఎంటిలు చేసే పనులు సామాన్యమైనవి కావు. సంఘటన జరిగిన స్థలానికి చేరుకున్న వెంటనే క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి తీవ్ర రక్తస్రావాన్ని అరికట్టడం, శ్వాస ఆగిపోయిన వారికి ఖూ= ద్వారా తిరిగి ప్రాణం పోయడం, గుండెపోటు వచ్చిన వారికి తక్షణమే 'లైఫ్ సపోర్ట్' అందించి ప్రాణాలు పోస్తున్నారు.

## గర్భాశయంగా మారిన 108 అత్యవసర అంబులెన్స్..

పునర్జన్మకు వేదిక ఆసుపత్రికి వెళ్లే లోపే ప్రసవ వేదన అనుభవించే గర్భిణీలకు 108 అంబులెన్సులే కాన్పు గదులుగా మారుతున్నాయి. మేడ్చల్ జిల్లాలోనే గత ఏడాది కాలంలో 3,557 గర్భిణీ కేసులను డీల్ చేశారంటే వారి అంకితభావం అర్థం చేసుకోవచ్చు. ఎంతో మంది తల్లుల, బిడ్డల ప్రాణాలను కాపాడి, ఆ కుటుంబాల్లో వెలుగులు నింపిన ఘనత ఈఎంటిలకే దక్కుతుంది. జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ తోకల శ్రీకాంత్ ఆధ్వర్యంలో 23 అంబులెన్సులు పనిచేస్తున్నాయి. ఈ విధి నిర్వహణలో భాగంగా 8,185 ట్రామా కేసులు, 966 ఆత్మహత్యాయత్నం కేసుల నుంచి వారిని కాపాడటమే కాకుండా, వారికి మానసిక ధైర్యాన్ని నూరిపోయడంలో వీరు ముందున్నారు.

## కరోనా కాలపు కన్నీటి వీరులు..

సొంత రక్త సంబంధీకులే తాకడానికి భయపడిన విపత్కర కరోనా రోజుల్లో, పిడుగులాంటి వార్తల మధ్య భరోసాగా నిలిచారు 108 సిబ్బంది. పి.పి.ఇ కిట్లు ధరించి, ఊపిరి సలపని పరిస్థితుల్లోనూ బాధితులను ఆలింగనం చేసుకుని ఆసుపత్రికి చేర్చిన వారి సాహసం చరిత్రలో నిలిచిపోతుంది. నిత్యం ఒత్తిడిలో ఈఎంటిల జీవితం అంటే కేవలం వైద్యం అందించడం మాత్రమే కాదు. ట్రాఫిక్ జాంలు, అంబులెన్స్‌కు దారి ఇవ్వని వాహనదారులు, బాధితుల బంధువుల ఆందోళన.. వీటన్నింటినీ తట్టుకుంటూ సెకన్ల కాలంతో పోటీ పడాలి.

## సమాజం ఇవ్వాల్సిన గౌరవం..

2005లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి మానస పుత్రికగా మొదలైన ఈ వ్యవస్థ, నేడు వేలాది కుటుంబాలను రోడ్డున పడకుండా కాపాడుతోంది.



ఈ.ఎం.టి లు కేవలం టెక్నీషియన్లు కాదు, వారు 'ప్రాణ యోధులు' మనం చేయాల్సింది ఒక్కటే.. రోడ్డుపై 108 సైరన్ వినపడగానే గౌరవంగా దారి ఇద్దాం. ఆ ఒక్క సెకను ఒక ప్రాణాన్ని కాపాడవచ్చు.
ప్రమాదంలో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ప్రజలను కాపాడటమే మా లక్ష్యం : చిత్రం రవి, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, 108 కీసర
అత్యవసర 108 అంబులెన్స్ సేవలో గత 16 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నా ప్రమాదంలో ఉండి అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కొట్టుమిట్టాడుతున్న అనేకమందిని కాపాడాను ఆ కాపాడటంలో ఆనందం మించింది.

ఉత్తమమైన ప్రథమ చికిత్స అందిస్తూ మెరుగైన వైద్యం అందే వరకు బాధితునికి తమ దగ్గర ఉన్న అన్ని రకాల పరికరాలను ఉపయోగించి సేవ చేయడమే తమ ముందున్న లక్ష్యం. కరోనా మహమ్మారి లాంటి పరిస్థితి వచ్చిన దేనికి భయపడలేదు. ప్రజలకు సేవ చేయడములో ప్రతినిత్యం ముందుంటున్నాం

# నీలోజిపల్లిలో ప్రజాపాలన గ్రామసభ విజయవంతం

- ప్రజల సూచనలతో గ్రామ అభివృద్ధికి దిశానిర్దేశం
- సర్పంచ్ అనుముల భాస్కర్ ఆధ్వర్యంలో గ్రామసభ
- మిషన్ భగీరథ, పశువుల నీటి సమస్యలపై తీర్మానాలు
- ప్రజల భాగస్వామ్యంతో ప్రగతి ప్రణాళిక



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామపంచాయతీలో 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామసభను నిర్వహించారు. ఈ సమావేశం సర్పంచ్ అనుముల భాస్కర్ ఆధ్వర్యంలో జరిగింది. మండల ప్రత్యేక అధికారి, డిప్యూటీ తహసీల్దార్ భూపేష్ ముఖ్య అతిథిగా హాజరై గ్రామాభివృద్ధిలో ప్రజల పాత్ర కీలకమని తెలిపారు.గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రజలతో చర్చించి వారి అభిప్రాయాలు సేకరించారు. ముఖ్యంగా మిషన్ భగీరథ అసంపూర్తి పనుల అమలు, వేసవికాలంలో పశువుల దాహార్తి నివారణకు నీటి కుండీల నిర్మాణంపై పాలకవర్గం తీర్మానాలు చేసినట్లు సర్పంచ్ అనుముల భాస్కర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్,వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వప్న, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పథకంతో నిరుపేద కుటుంబానికి సొంత ఇంటి కల సాకారం

- విలాసాగర్ గ్రామ సర్పంచ్ : ఏనుగుల కనుకయ్య



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, విలాసాగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించిన ఇంటికి నూతన గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా నిరుపేదలకు సొంత ఇళ్ల కలను నిజం చేస్తూ, గ్రామానికి చెందిన సాగరం నాగరాజు -- ఉమ దంపతులు తమ కలల గృహాన్ని సాకారం చేసుకున్నారు.ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య ఆధ్వర్యంలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం గృహ ప్రవేశ వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషిని కొనియాడుతూ, తమకు సొంత ఇల్లు కలగడానికి ఆయన చేసిన సహకారం మరువలేనిదని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం సహకారంతో లబ్ధిదారులు తమ సొంతింటి కలను సాకారం చేసుకున్నారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జోగు శంకర్, గోల్కొండ సూరి, యూత్ కాంగ్రెస్ నాయకులు ఏనుగుల ప్రశాంత్ కుమార్, ఏనుగుల అనిల్ కుమార్, గ్రామ కార్యదర్శి మిరుదొడ్డి శ్రీనివాస్, కారోబార్ సుమన్ తదితరులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి బాధితులకు ఒక ఆర్థిక భరోసా

- ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ధ్యేయం
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు : తెడ్డు అశోక్
- ముచ్కూర్ గ్రామంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా, భీంగల్ మండలం, ముచ్కూర్ గ్రామంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ. 1.70 లక్షల విలువగల చెక్కులను గురువారం కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తెడ్డు అశోక్ మాట్లాడుతూ– ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలబడటమే ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. ఈ నిధి ద్వారా అనేక మంది వైద్య చికిత్సలు పొందుతూ తిరిగి సాధారణ జీవితం గడుపుతున్నారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రతి అవసరమైన చోట సహాయం అందిస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు ఇలాంటి సేవలు మరింత విస్తృతంగా అందించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు బాయికాడి రాజు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మురారి, లింబాద్రి, గంగారెడ్డి, వార్డు సభ్యులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆరోగ్యానికి ప్రకృతి అందించిన అద్భుత వరం - సహజసిద్ధమైన 'సంజీవిని' చేదు ఆకు బిట్టర్ లీఫ్

మరిన్ని చిత్రాల కోసం ఈ QR స్కాన్ చెయ్యండి





నేటి కాలంలో మధుమేహం, కాలేయ సమస్యలు మరియు వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండటం ప్రతి ఇంటా సాధారణమైపోయాయి. ఈ సమస్యలకు ఆయుర్వేదంలో అద్భుతమైన పరిష్కారాలు ఉన్నాయి. తమ జీవితాన్ని అరుదైన వనమూలికల పరిశోధనకు మరియు వెలికితీతకు అంకితం చేశారు, వైద్యులు సింహాచలం లక్ష్మణ స్వామి. వారి అపారమైన కృషి ఫలితంగా, నేడు ప్రపంచానికి ఒక గొప్ప ఔషధ గనిని పరిచయం చేస్తున్నారు.

## మొక్క పరిచయం..

ఈ మొక్క సాధారణ నామం చేదు ఆకు. వాడుకలో దీనిని కట్టు సంజీవి లేదా కాటు సంజీవి అని కూడా పిలుస్తారు. వృక్షశాస్త్రంలో దీని శాస్త్రీయ నామం వెర్నోనియా అమిగ్డాలినా. దీని ఆకులు విపరీతమైన చేదును కలిగి ఉన్నప్పటికీ, ఇవి అందించే ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం అమృతంలా పనిచేస్తాయి. ప్రకృతిలో దాగి ఉన్న ఈ అరుదైన వనమూలికను ప్రజల ముందుకు తీసుకురావడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నాము.

## చేదు ఆకు అద్భుత ప్రయోజనాలు..

మధుమేహ నియంత్రణ: రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో ఇది అద్భుతంగా పనిచేస్తుంది. భోజనం చేసిన తర్వాత చక్కెర పెరగకుండా నియంత్రించడంలో ఇది సహజసిద్ధమైన ఔషధంలా ఉపయోగపడుతుంది.

**కాలేయ రక్షణ:** మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవమైన కాలేయాన్ని రక్షించడంలో ఈ చేదు ఆకు ముందుంటుంది. కాలేయ కణాలను రక్షించి, కాలేయం పనితీరును మెరుగుపరుస్తుంది మరియు శరీరాన్ని శుద్ధి చేస్తుంది.

**రోగనిరోధక శక్తి వృద్ధి:** ఇందులో పుష్కలంగా ఉన్న జీవసత్వాలు మరియు ఖనిజ లవణాలు శరీర వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తాయి.

**జీర్ణక్రియ మరియు పేగుల ఆరోగ్యం:** ఆకలిని పెంచి, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. కడుపులోని హానికరమైన పురుగులను (పరాన్నజీవులను) నాశనం చేస్తుంది.

చర్మ మరియు కేశ సంరక్షణ: ముడతలు, మచ్చలు తగ్గించి చర్మాన్ని కాంతివంతంగా మారుస్తుంది. జుట్టు రాలడం మరియు చుండ్రు సమస్యలను అరికడుతుంది.

## వాడే విధానం..

ఈ మొక్కను వాడటం చాలా సులభం. దీనిని రెండు విధాలుగా తీసుకోవచ్చు.నేరుగా నమలడం: రోజూ ఉదయం పరగడుపున ఒకే ఒక చేదు ఆకును నేరుగా నమలడం ద్వారా అత్యుత్తమ ఫలితాలు పొందవచ్చు.కషాయం రూపంలో: గుప్పెడు ఆకులను నీటిలో సగం అయ్యేవరకు మరిగించి, కషాయం లాగా తయారుచేసి త్రాగవచ్చు. చేదుగా అనిపిస్తే కొద్దిగా తేనె కలుపుకొని తీసుకోవచ్చు.మోతాదు, వాడే విధానం గురించి మరింత స్పష్టమైన సమాచారం కోసం ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం అంతర్జాల దృశ్య వేదిక (యూట్యూబ్ ఛానల్) ను సందర్శించండి. ఈ మొక్క గొప్పదనం, వాడే విధానం, మోతాదు మరియు జాగ్రత్తల గురించి వైద్యులు సింహాచలం లక్ష్మణ స్వామి సవివరంగా దృశ్యమాధ్యమం ద్వారా వివరించారు. ఈ అరుదైన విషయాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరుతున్నాము.ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు,

**వైద్యులు**

**సింహాచలం లక్ష్మణ స్వామి**

# ప్రజా భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం

- బోయినిపల్లి ఎంపీడీఓ : భీమా జయశీల
- ఇందిరమ్మ ఇళ్లతో అభివృద్ధి దిశగా బోయినిపల్లి మండలం
- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ : బోయిని ఎల్లేష్ యాదవ్
- లబ్ధిదారుల - నిధుల వివరాలు వెల్లడించిన సర్పంచ్ : నల్ల మోహన్
- బోయినిపల్లిలో ప్రజాపాలన గ్రామ సభ - అభివృద్ధి పై చర్చలు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామసభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం సర్పంచ్ నల్లమోహన్ ఆధ్వర్యంలో జరగగా, మండల ప్రత్యేక అధికారి ఎంపీడీఓ జయశీల పాల్గొని ప్రసంగించారు. ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కార్యక్రమం ప్రారంభంలో తెలంగాణ గీతాన్ని ఆలపించి, అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని సభలో వినిపించారు. గ్రామంలో అమలైన వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు,నిధుల వినియోగంపై సర్పంచ్ నల్లమోహన్ సమగ్రంగా వివరించారు. గ్రామ అభివృద్ధి పనులపై ప్రజలతో చర్చించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండున్నర సంవత్సరాల్లో అనేక ప్రజాహిత పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో మండలంలో జిల్లాలోనే అధికంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయినట్లు తెలిపారు. గృహ జ్యోతి, ఉచిత బస్సు, రైతు భరోసా, రుణమాఫీ, సన్న



బియ్యం వంటి పథకాలు ప్రజలకు ఉపయుక్తంగా మారాయని పేర్కొన్నారు.తదనంతరం వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల పేర్లను సభలో చదివి వినిపించారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రజనీ దేవి రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.ఎంపీడీఓ జయశీల మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో పారిశుధ్యం, పెండింగ్ సమస్యల పరిష్కారం, వైద్య సేవలు, రోడ్డు భద్రత, వ్యవసాయం, మహిళా సంక్షేమం వంటి విభాగాల్లో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లేలా అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు పుస్తకాలు,దుస్తులు,షూలు, స్టేషనరీ అందిస్తున్నామని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామస్తులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.వచ్చే జూన్ నెలలో అమలులోకి రానున్న కొత్త పథకాలపై కూడా వివరించారు .గ్రామపంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రజనీ దేవి,హౌసింగ్ ఏఈ, జీపిఓ, ఏఈఓలు, ఉపసర్పంచ్ మెరుపుల చందన – జలంధర్,గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గుంజ పడగ గ్రామంలో జరిగిన గ్రామసభకు విశేష స్పందన.

**99 రోజులలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామసభ.**


**గ్రామసభలో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల కొనసాగింపు.**





మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మండలం గుంజపడుగు గ్రామములో జరిగిన గ్రామసభకు ప్రజలు విశేషంగా తరలివచ్చారు ప్రతి అర్హులకు పథకాలు అందాలని గ్రామ సర్పంచి సర్పంచ్ దండేవేనా సంధ్యా బానేష్ కార్యదర్శి ఇంతకుముందు లబ్ధి పొందిన లబ్ధిదారుల జాబితాను చదివి కొత్తవారికి అవకాశం కల్పించినారు గ్రామంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నిర్వహించి ఈ గ్రామ సభలో గుంజపడుగు అభివృద్ధికి అనేక కార్యక్రమాలను అనేక సమస్యలను ప్రజల ముందుకు చర్చించి ఇకముందు వాటి పురోగతికి పాటుపడతానని గ్రామ సర్పంచి సంధ్యారాణి కార్యక్రమాలు అన్ని అందేలా చూస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వము నుండి అందే కార్యక్రమాలకు ప్రతి ఒక్కరు బాధ్యతగా మసలు కొని అర్హులకు ఆటంకం కలగకుండా అభివృద్ధి పాటుపడాలని సర్పంచి సంధ్యారాణి పేర్కొన్నారు. ఎన్నో కార్యక్రమాలు నెరవేర్చుటకు శాఖల వారీగా ఆయా శాఖల వారు నిర్వహిస్తున్న పనులను గ్రామ ప్రజల సమక్షంలో వివరించడం జరిగింది. కల్యాణ లక్ష్మి, ఇందిరమ్మ ఇల్లు, పారిశుద్ధం, మిషన్ భగీరథ , విద్యుత్, అంగన్వాడి ముఖ్యంగా గ్రామంలో ప్లాస్టిక్ నిషేధం వంటి కార్యక్రమాలపై చర్చించడం జరిగింది. ఈజీఎస్ పనుల గురించి చర్చించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉపసర్పం ఎల్కలక్ష్మి సదానందం, వార్డు సభ్యులు ఊదరి కవిత, సాదుల సుజాత, సాదుల కళ్యాణి, దేవరకొండ పోచం దొడ్డిపట్ల శంకర్, శనిగారపు సుమలత, దేవల లక్ష్మి, భోగ సంపత్, కాసిపేట తిరుపతి, భోగ రాజేశ్వరి, కార్యదర్శి నరేష్ స్పెషల్ ఆఫీసర్ రవి , ఎంపీ ఓ షబ్బీర్ పాల్గొన్నారు ఈసారి గ్రామం నుండి అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది ప్రతి ఒక్కరు గ్రామ అభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ సంధ్యారాణి ఈ గ్రామసభకు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రణబాలిలో ఇంటెన్స్ లుక్‌లో విజయ్




విజయ్ దేవరకొండ హీరోగా, రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ అనంతపురంలో శరవేగంగా జరుగుతోంది. అయితే, తాజాగా ఈ షూటింగ్ స్పాట్ నుండి ఒక వీడియో లీక్ అయింది. ఇందులో విజయ్ దేవరకొండ మునుపెన్నడూ చూడని విధంగా చాలా ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్నాడు. లీకైన ఫుటేజీలో విజయ్ ఉగ్రరూపంతో కనిపిస్తున్నాడు. ముఖ్యంగా ఆయన డైలాగ్ డెలివరీ వాయిస్ మోడ్యులేషన్ పీక్స్‌లో ఉందనే చెప్పాలి. ఊర మాస్ డైలాగులు థియేటర్లలో విజిల్స్ వేయించడం ఖాయమనిపిస్తోంది. ఈ లీక్డ్ వీడియో చూస్తుంటే.. పవర్ ఫుల్ యాక్షన్స్ సీక్వెన్స్ తెరకెక్కిస్తున్నట్టుగా అనిపిస్తోంది. ఈ సినిమాలో విజయ్ బాడీ లాంగ్వేజ్, ఆ యాస ఆయన కెరీర్‌లోనే అత్యుత్తమంగా నిలుస్తాయని ఫ్యాన్స్ భావిస్తున్నారు. 'ట్యాక్సీవాలా' తర్వాత విజయ్-రాహుల్ సంకృత్యన్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. పైగా ఇందులో రష్మిక మందన్న కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు ఆకాశాన్నంటాయి. అయితే, లీకైన వీడియో చూసి ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నప్పటికీ, చిత్ర బృందం మాత్రం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ మధ్య వస్తున్న సినిమాలన్నీ కూడా ఇలాంటి లీకుల బారిన పడుతున్నాయి. మేకర్స్ ఎన్ని జాగ్రత్తలు తీసుకున్న లీకుల బెడద తప్పడం లేదు. కానీ, రణబాలి లీక్ మాత్రం.. ఈసారి రౌడీ హీరో రష్మికతో కలిసి బి÷-గగెస్ట్ బ్లాక్‌బస్టర్‌ను కొట్టడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.

# సిగ్గులు అద్దిన చెక్కిళ్లు

తరుణ్‌భాస్కర్, ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'గాయపడ్డ సింహం'. కశ్యప్ శ్రీనివాస్ దర్శకుడు. మే 1న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం ఈ సినిమా నుంచి 'బ్రైడ్ సాంగ్'ను విడుదల చేశారు. ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్ మూడ్‌ని ప్రతిబింబిస్తూ ఈ పాట సాగింది. 'కాటుక దిద్దిన కళ్లు.. సిగ్గులు అద్దిన చెక్కిళ్లు' అంటూ పెళ్లికి ముందు వధువు మనోభావాల్ని అందంగా ప్రజెంట్ చేసింది. సంగీత దర్శకుడు స్వీకర్ ఆగస్త్తీ ట్రెండీ బీట్‌తో పాటను కంపోజ్ చేశారు. శ్రీమణి సాహిత్యం ఆకట్టుకునేలా ఉంది. అమెరికా వెళ్లాలని కలలు కనే యువకుడు ఎదుర్కొన్న కష్టాల నేపథ్యంలో హాస్యప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ చిత్రానికి సంగీతం: స్వీకర్ అగస్తీ, నిర్మాతలు: కల్యాణ చక్రవర్తి, భానుకిరణ్ ప్రతాప, విజయ్‌కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సాల్, రచన-దర్శకత్వం: కశ్యప్ శ్రీనివాస్.



# ఫ్యూచరిస్టిక్ లవ్‌స్టోరీ



తమిళ, తెలుగు భాషల్లో వరుస విజయాలతో దూసుకుపోతున్నాడు యువహీరో ప్రదీప్ రంగనాథన్. ఆయన నటిస్తున్న తాజా ప్రేమకథా చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకురానుంది. విఘ్నేశ్ శివన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని నయనతార నిర్మించారు. కృతిశెట్టి కథానాయికగా నటించింది. బుధవారం ఈ సినిమా టీజర్‌ను హీరో రానా విడుదల చేశారు. 'ప్రపంచం ఎక్కడికో వెళ్లిపోయింది.. మనం ఇప్పుడు 2040లో ఉన్నాం' అనే వాయిస్ ఓవర్‌తో మొదలైన టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది. దర్శకుడు విఘ్నేశ్ శివన్ ఫ్యూచరిస్టిక్ వరల్డ్ బ్యాక్‌డ్రాప్‌లో కథను డిజైన్ చేశాడని టీజర్‌ను చూస్తే అర్థమవుతున్నది.

'లవ్ ఎట్ ఫస్ట్‌సైట్ అనేది ఇంకా ఉంది.

ఈ అమ్మాయిని చూడగానే అర్థమైంది' అనే సంభాషణలు హైలైట్‌గా నిలిచాయి. శ్రీపద్మిని సినిమాస్ ద్వారా ఈ సినిమా తెలుగు రాష్ట్రాల్లో విడుదల కానుంది. యోగి బాబు, సీమాన్, గౌరీ కిషన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రవి వర్మన్, సంగీతం: అనిరుధ్ రవిచందర్, రచన-దర్శకత్వం: విఘ్నేష్ శివన్.

# సోనాలి బింద్రేపై భూ కబ్జా ఆరోపణలు..

## - బ్లాక్ మెయిల్ కోసమేనంటూ నటి ఫైర్!



బాలీవుడ్ నటి సోనాలి బింద్రే భూ వివాదంలో చిక్కుకున్నారు. పూణె జిల్లా లోనావాలా సమీపంలో తన భూమిని సోనాలి కబ్జా చేశారంటూ స్థానిక రైతు ఒకరు పోలీసులను ఆశ్రయించారు. ఈ వార్తలు మీడియాలో రావడంతో సోనాలి బృందం వెంటనే స్పందించి, ఆ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. ఇదంతా బ్లాక్ మెయిల్ చేసే ప్రయత్నమేనని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే.. లోనావాలాలో సోనాలి బింద్రేకున్న ఆస్తి పక్కనే తన పొలం ఉందని, ఆమె తన భూమిలోకి చొరబడి కంచె వేసుకున్నారని రైతు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రశ్నించేందుకు వెళ్లగా తనను బెదిరించారని కూడా ఆయన ఆరోపించారు. దీనిపై స్థానిక పోలీసులతో పాటు ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్లు వివరించారు.ఈ ఆరోపణలపై సోనాలి బింద్రే తరఫు న్యాయవాదులు ఒక ప్రకటన విడుదల చేశారు. రైతు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. ఆ భూమిని తాము నిబంధనలకు అనుగుణంగా, చట్టబద్ధంగా కొనుగోలు చేశామని స్పష్టం చేశారు. తాము ఎవరి భూమినీ ఆక్రమించలేదని, భూమికి సంబంధించిన అన్ని పత్రాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. కేవలం సెలబ్రిటీ అయినందున, డబ్బుల కోసం బ్లాక్ మెయిల్ చేసే ఉద్దేశంతోనే ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని సోనాలి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ ఫిర్యాదుపై పూణె గ్రామీణ పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించి, భూసర్వే నిర్వహించాలని నిర్ణయించారు.

సర్వే పూర్తయితేనే భూమి ఆక్రమణకు గురైందా? లేదా? అనే విషయంపై స్పష్టత వస్తుందని అధికారులు వెల్లడించారు.

# రామాయణ టీజర్ విడుదల



రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో నితీశ్ తివారీ దర్శకత్వంలో రానున్న సినిమా 'రామాయణ' ఇప్పుడు ఆసక్తి రేకెత్తిస్తోంది. హనుమాన్ జయంతి సందర్భంగా ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. రాముడి పాత్రలో రణ్‌బీర్ ఆకట్టుకుంటున్నారు. వీఎఫ్ఎక్స్ ఈ టీజర్‌కు హైలైట్ గా నిలిచాయి. సుమారు రూ.4000కోట్లతో ఈ ప్రాజెక్ట్ రూపొందుతోంది. మొదటి భాగం దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రభాస్ ఆదిపురుష్ అంతగా ఆకట్టుకోలేక పోయిన తరవాత వస్తున్న ఈ సినిమాపై భారీగా అంచనాలు ఉన్నాయి. సీతగా సాయిపల్లవి నటిస్తుండగా, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. 'రామాయణ' ప్రాజెక్ట్‌లో భాగం కావడంపై నటుడు రణ్‌బీర్ కపూర్ మీడియా మీట్‌లో మాట్లాడారు. ఇలాంటి అద్భుతమైన చిత్రాల్లో నటించాలని తాను అనుకున్నానని.. తన కల నెరవేరిందన్నారు. 2000లో విజువల్ ఆర్ట్స్‌కు సంబంధించి విదేశాల్లో శిక్షణ తీసుకున్నా. ఓసారి నా మిత్రుడు.. నువ్వు ఏం కావాలనుకుంటున్నావు? అమెరికాలోనే స్థిరపడి వర్క్ చేయాలనుకుంటున్నావా? అని అడిగాడు. మా సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే సినిమాతో అమెరికా వస్తా అని బదులిచ్చా. ఈ సినిమాతో నా కల నెరవేరిందని రణ్‌బీర్ అన్నారు. ఇందులో నటించేందుకు మొదట తాను ఆసక్తి చూపించలేదన్నారు. తండ్రి అయ్యాక తన ఆలోచనా విధానంలో మార్పు వచ్చిందన్నారు. భయాన్ని వదిలి ధైర్యంగా ఈ సినిమాలో నటించేందుకు ముందుకొచ్చానని తెలిపారు.దీపావళి కానుకగా 'రామాయణ' తొలి భాగం ప్రేక్షకుల ముందుకురానుంది.

# ఇది కలనో.. మాయ వలనో



బ్లాక్‌బస్టర్ 'బిచ్చగాడు' తర్వాత శశి దర్శకత్వంలో విజయ్ ఆంటోని నటిస్తున్న చిత్రం 'వంద దేవుళ్లు'. స్వాసిక కథానాయిక. రామాంజనేయులు జవ్వాజి నిర్మాత. మే నెలలో సినిమా విడుదల కానున్నది. తాజాగా ఈ సినిమా నుంచి 'ఇది కలనో.. మాయ వలనో' అంటూ సాగే మెలోడీ గీతాన్ని బుధవారం విడుదల చేశారు. భాగ్యశ్రీ ఈ పాట రాయగా, బాలాజీ శ్రీరామ్ స్వరపరిచారు. శిఖి శ్రీనివాసన్, శిరీష భాగవతుల ఆలపించారు. ఈ పాటలో విజయ్ ఆంటోని, స్వాసిక కనిపిస్తున్న తీరు, ప్రేమను వ్యక్తం చేస్తున్న విధానం ఆసక్తికరంగా ఉంది. అజయ్, కావ్య, కార్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్‌దాస్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎస్‌బీ దర్శన్ కిర్లోష్, సంగీతం: బాలాజీ శ్రీరామ్, సమర్పణ: ఫాతిమా విజయ్ ఆంటోని, నిర్మాణం: విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్, సర్వంత్ రామ్ క్రియేషన్స్.

## అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి పాపన్న గౌడ్ స్ఫూర్తి

**- ఆత్మ గౌరవ పోరాటాల యోధుడికి స్మరాంజలి**

**- గౌడ సంఘం మండలాధ్యక్షులు, స్తంభంపల్లి గ్రామ సర్పంచ్ : బొంగాని అశోక్ గౌడ్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) అణగారిన వర్గాల ఆత్మగౌరవ పోరాటాలకు నిరంతర ప్రేరణగా నిలిచిన,తెలంగాణ గడ్డపై తొలి బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండల గౌడ సంఘం అధ్యక్షులు, స్తంభంపల్లి గ్రామ సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ ఆ మహానీయుడికి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. అణగారిన వర్గాల హక్కుల కోసం, సమానత్వ సమాజం కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలు ఎదగాలంటే పాపన్న గౌడ్ చూపిన మార్గంలోనే నడవాలని సూచించారు. అంతేకాకుండా యువత ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని, విద్య, ఐక్యత, ధైర్యంతో ముందుకు సాగితేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో జీవించే పరిస్థితులు కల్పించడమే ఆయనకు నిజమైన నివాళి అవుతుందని తెలిపారు.

# నారాయణ పాఠశాలలో ఘనంగా స్నాతకోత్సవం







తార్నాక(ప్రశ్న న్యూస్) నారాయణ పాఠశాలలో స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ముఖ్య అతిథులుగా జిఎం గోపాల్ రెడ్డి, ఏజిఎం బాలపరమేశ్వరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులు కేజీ విద్య నుంచి ప్రాథమిక విద్యలోకి, మరియు ప్రాథమిక విద్య నుంచి ఉన్నత తరగతులకు ప్రవేశిస్తున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి పట్టా ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన స్థానంలో నిలవడానికి ప్రధాన భూమిక గా స్నాతకోత్సవం నిలుస్తుందని తెలిపారు.

ప్రిన్సిపాల్ పర్వీన్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉండి ఇలాంటి పట్టాలు మరెన్నో పొందాలని ఆకాంక్షించి, జీవితంలో ఉన్నత స్థానంలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నారాయణ పాఠశాలల పదవ తరగతి ఇంచార్జీ ముంతాజ్, ఆర్ ఐ డి లు మనోహర్, మహేశ్వరి, మీనా, కో- ఆర్డినేటర్స్ ఆజాద్, లక్ష్మీభవాని, నూర్, ఏడి సురేష్. వీపీ సరిత, షాహీన్, ఏఓ మహేందర్, పిఈటీ నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కిష్టాపూర్ గ్రామని అదర్శన గ్రామపంచాయతీ గా తీర్చిదిద్దుతాం

**గ్రామ అభివృద్ధి కోసం ప్రజల భాగ్యస్వామ్యం కీలకం**

**గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఉశయ్య**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో గురువారం నాడు గ్రామ సర్పంచ్ సాదున స్వప్న ఉషయ్య ఆధ్వరంలో గ్రామసభ నిర్వహించడం జరిగింది అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని గ్రామపంచాయతీ నివేదికను పంచాయతీ సర్పంచ్ గ్రామసభలో చదివి వినిపించగా పలువురు సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు వారి అభిప్రాయాలను వెల్లడించారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచి మాట్లాడుతూ కిష్టాపూర్ గ్రామ ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దామని వారు తెలిపారు కిష్టాపురం గ్రామంలో విద్యుత్ సౌకర్యాలు మెరుగుదల కోసం 20 విద్యుత్ స్తంభాలు 1 ఏ బి స్విచ్ మరియు మూడు సింగిల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్ 25 కెవిఎ మంజూరు చేయవలసిందిగా విద్యుత్ అధికారులను వినతి పత్రం సమర్పించారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి నాగరాజు, పంచాయతీ సెక్రెటరీ మమత, మరియు సంబంధిత అధికారులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక గ్రామ సభలో పాల్గొన

**మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) రెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి పాలన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వం ప్రజలకు మరింత మేలు చేయడం కోసం చేపట్టిన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను నేరుగా వినడం, వాటిని త్వరగా పరిష్కరించడం మరియు అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం లక్ష్యంగా గ్రామసభలు నిర్వహిస్తున్నాం అన్నారు.

గ్రామంలోని సమస్యలు మరియు అభివృద్ధి అవసరాలను క్షేత్రస్థాయిలో నమోదు చేయించి, సకాలంలో పరిష్కారం కోసం ప్రయత్నాలు చేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని, ప్రజా సమస్యల పరిష్కారమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా దేశంలోనే ప్రత్యేకంగా సన్నబియ్యం పంపిణీ చేపట్టి, పాఠశాలల నుంచి కళాశాలల వరకు విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని చెప్పారు. 99 రోజుల ప్రణాళిక ద్వారా గ్రామంలో మౌలిక వసతులు, సేవల పరంగా గణనీయమైన మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్రమ సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్, స్పెషల్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శి రమేష్, పాలకవర్గ సభ్యులు,అధికారులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ చీఫ్ జస్టిస్ చేతులమీదుగా విన్నర్ కప్ అందుకున్న పూర్వ ఏజిపి విశ్వేశ్వర్

**ట్రోఫీ బహుకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్**




హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్ ) హైదరాబాద్ కి చెందిన మాజీ హోం శాఖ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు , ఏజిపి విశ్వేశ్వర్ క్రికెట్ విన్నర్ ట్రోఫీని అందుకున్నారు. ఈ మేరకు తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆపరేష్ కుమార్ సింగ్ విన్నింగ్ బహుమతిని విశ్వేశ్వర్'కి అందజేశారు. గతవారం సికింద్రాబాద్ జింఖానా మైదానంలో హైకోర్టు జడ్జిలు , అడ్వకేట్ల జట్ల మధ్య క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఫైనల్ మ్యాచ్ లో అడ్వకేట్ ఏ జట్టు అడ్వకేట్ డి జట్టుపై విజయం సాధించి కప్ కైవసం చేసుకుంది.

## టేక్మాల్ మండలం వెలుపుగొండ రేషన్ షాపును జిల్లా సివిల్ సప్లై ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు

**రేషన్ డీలర్ దినకర్ పై జు.జ్వాజు 1995 నిబంధనల ప్రకారం06-వా కేసు నమోదు**

**జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లాలో పౌరసరఫరాల శాఖ విధులు పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్టంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్ వెల్లడించారు. గురువారం ఆంధ్రప్రభ, వార్తాపత్రికలలో రేషన్ షాపులో అక్రమాలు అనే వార్తకు స్పందించిన నిత్యానంద్ టేక్మాల్ మండలం వెలుపుగొండ గ్రామం 1708004 రేషన్ షాప్ ను జిల్లా సివిల్ సప్లై ఎన్ఫోర్స్మెంట్ సిబ్బందితో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులు స్టాక్ రిజిస్టర్లు మరియు భౌతిక నిలువలను పరిశీలించగా రేషన్ షాప్ డీలర్ శ్రీ దినకర్ వద్ద 36.32 క్వింటాల పిడిఎస్ బియ్యం తక్కువగా ఉన్నట్లు నిర్ధారించబడిందని వెల్లడించారు దీనిపై సంబంధిత డీలర్ పై ఈసీ యాక్ట్ 1955 నిబంధనల ప్రకారం 6-వా కేసు నమోదు చేయబడింది అన్నారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ సేవలు అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని రేషన్ షాపు డీలర్లుకు తగు సూచనలు జారీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలను మార్గదర్శకాలను మరియు సమయపాలన కచ్చితంగా పాటించాలని ఆదేశించడం జరిగిందన్నారు మూడు నెలలకు సంబంధించిన బియ్యం కార్డుదారులకు ఎలాంటి అవకతవకలకు పాలుపలకుండా సక్రమంగా పంపిణీ చేయవలసిందిగా సూచించారు. రేషన్ షాప్ డీలర్లు భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి



తార్నాక(ప్రశ్న న్యూస్) బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316వ వర్ధంతిని ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాజుల లింగం గౌడ్ మాట్లాడుతూ బహుజనులందరూ ఏకతాటి మీదికి వస్తేనే తెలంగాణలో రాజ్యాధికారం సాధించగలుగుతామని, ఈ దేశంలో జంతువులకు లెక్కలు ఉన్నాయి కానీ, బీసీలకు లెక్కలు లేవన్నారు. జనగణనలో బీసీలకు స్పష్టంగా లెక్కచేయాలని బిసి మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీలు అందరం ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు హరీష్ గౌడ్ మాట్లాడుతూ పాపన్న ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని, రాజ్యాధికారం సాధించాలంటే కుట్రలకు బలి కావద్దన్నారు. అందరూ ఏకతాటి మీద ఉంటేనే తెలంగాణ రాష్ట్రంలో, దేశంలో అయినా రాజ్యాధికారం సాధించ గలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పబ్బు అయోధ్య గౌడ్, ఓయూ జేఏసీ నాయకులు అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**- ఊరూరా వాడవాడల్లో అంజన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు**



మంథని ( ప్రశ్న న్యూస్) శ్రీ పవనసుత అంజనీపుత్ర హనుమాన్ జయంతి వేడుకలు గురువారం గ్రామ గ్రామాల్లో అన్ని వాడల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఐదు గంటల నుండి భక్తుల సందర్శనలతో ఆలయాల్లో పండుగ వాతావరణ నెలకొంది. చరిత్ర మాసం పౌర్ణమితి రోజున శ్రీ హనుమాన్ జయంతి వేడుక నిర్వహించుకోవడం ఈ ప్రాంతంలో కూడా ఆనవాయితీగా వస్తుంది. అలాగే శ్రీ ఆంజనేయ స్వామి జననం వైశాఖమాసం కృష్ణ దశమి కర్కాటక లగ్నం పూర్వాభాద్ర నక్షత్రంలో వైదృతి యోగంలో అంజనా దేవి శ్రీ ఆంజనేయ స్వామి కి జన్మనిచ్చింది. కాబట్టి వైశాఖమాసంలో కూడా హనుమాన్ జయంతి ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీగా అనాదిగా వస్తుంది.

ఇందులో భాగంగా మంథని పట్టణంలోని తమ్మి చెరువు కట్ట రావుల చెరువు కట్ట పెంచేరు కట్ట వాగు గడ్డ బోయిన్ పేట గ్రామంలోని ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీ బలవీర హనుమాన్ దేవాలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత నెల రోజులుగా స్థానిక పెంజేరు కట్ట హనుమాన్ దేవాలయంలో నెల రోజులపాటు ఘనంగా భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హనుమాన్ జయంతి గురువారం చక్రిభజనలో అన్ని వాడలకు చెందిన భక్తులు పాల్గొన్నట్లు నిర్వాహకులు దహగం లింగన్న, లోకే మనోహర్, టక్కే గారి రాధాకృష్ణ, లోకే శరత్, చిలప్ప గారి శివాలు తెలిపారు. శుక్రవారం అన్ని దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు.

**హనుమద్విజయోత్సవం :**

ఉత్తరాది వారికి చైత్ర పూర్ణిమ హనుమజ్జయంతి. దీనిని హనుమద్విజయోత్సవం అంటారు. ఒరియా ప్రజలు మేష సంక్రాంతినాడు హనుమజ్జయంతి జరిగినట్లు భావిస్తారు. తమిళనాట మార్గశిర అమావాస్య నాడు హనుమజ్జయంతిని నిర్వహిస్తారు. మార్గశిరంలోనే శుద్ధ త్రయోదశి తిథిని కన్నడ ప్రజలు జరుపుకుంటారు. ఆనాడే తెలుగునాట హనుమద్వ్రతం చేసుకునే ఆచారం ఉంది. జ్యేష్ఠమాసంలో సువర్చలా హనుమంతుల కల్యాణం నిర్వహిస్తారు. హనుమంతుని భక్తులకు ఎన్నడూ అపజయం లేదు. ఓటమి లేదు.

లక్ష్యసాధనలో తనకంటూ ఒక నిర్దుష్ట మార్గాన్ని ఆచరణాత్మకంగా ప్రకటించిన కార్యసాధకుడు. అజేయ బలపరాక్రమ సంపన్నుడైనా అంతా రామనామ మహిమ అనే ఒక్కమాటతో అచంచలమైన స్వామిభక్తిని ప్రకటించే దాసానుదాసుడు. ఇన్ని సుగుణాల కలబోత కనుకనే ఆంజనేయుడు అందరి దైవం. చైత్రపౌర్ణమికి భక్తులు హనుమద్దీక్షా స్వీకారం చేస్తారు. హనుమద్దీక్షా పరులకు శారీరక మానసిక రుగ్మతలు, భూత ప్రేత పిశాచ బాధలు తొలగి సుఖ శాంతులు కలుగుతాయి.

## మంత్రి దామోదర్ ని కలిసిన ఇంచార్జ్ శివంత్ రెడ్డి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మహబూబ్నగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర్ రాజనర్సింహ ని కలిసిన తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహబూబ్నగర్ జిల్లా ఇన్చార్జ్ శివంత్ రెడ్డి. మహబూబ్నగర్ జిల్లా యువజన కాంగ్రెస్ సభ్యులకు తెలంగాణ రాష్ట్రం ఇచ్చే ప్రభుత్వ పథకాలు అందేలా ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి ని కోరిన శివంత్ రెడ్డి. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి యువజన కాంగ్రెస్ కి అన్ని విధాలుగా అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు.

## సమానత్వానికి ప్రతీక సర్దార్ పాపన్న గౌడ్

**- గౌడ సంఘం నాయకులు : ముద్దం రవీందర్ గౌడ్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల గౌడ సంఘం నాయకులు ముద్దం రవీందర్ గౌడ్ సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా ఆ మహానీయుడికి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ముద్దం రవీందర్ గౌడ్ మాట్లాడుతూ, సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ అనేది బలహీన వర్గాల కోసం పోరాడిన మహా యోధుడని అన్నారు. సమాజంలో అణగారిన వర్గాలకు స్వాభిమానాన్ని కలిగించి, వారి హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన చూపిన ధైర్యం, త్యాగం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. పాపన్న గౌడ్ ఆశయాలను నేటి తరానికి చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, సమాజ అభివృద్ధికి ఆయన చూపిన మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ముందుకు సాగితేనే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని తెలిపారు.

# మళ్ళీ రెచ్చిపోతున్న పెట్రోల్ మాఫియా



- కట్టడి మరచిన అధికారులు - రహదారి పక్కనే యదేచ్ఛగా అడ్డాలు
- ఎవరేం చేస్తారంటూ అధికారులకే సవాల్
- అధికారులు దాడులు చేయాలని స్థానికుల విన్నపం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)**ఘట్కేసర్‌లో ఆగని పెట్రోల్ మాఫియా ఆగడాలు రోజురోజుకు పెరుగుతున్నాయనే విమర్శలు స్థానికుల నుండి వెల్లువెత్తుతున్నాయి. ఘట్కేసర్, మేడిపల్లి, మల్లాపూర్, చర్లపల్లి పరిసర ప్రాంతాల్లో, ముఖ్యంగా రహదారుల పక్కనే, బహిరంగంగా పెట్రోల్ దొంగతనం జరుగుతుండడం ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. పోలీసులకు, సివిల్ సప్లై అధికారులకు ఏమాత్రం భయపడకుండా మాఫియా గుంపులు తమ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నాయి.స్థానికుల ఆరోపణల ప్రకారం కొందరు వ్యక్తులు ప్రత్యేకంగా అడ్డాలుగా ఏర్పడి పెట్రోల్ దొంగిలించి తక్కువ ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి అని తేడా లేకుండా పగటిపూట కూడా ఈ కార్యకలాపాలు జరుగుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. ఇంత బహిరంగంగా దొంగతనం జరుగుతున్నప్పటికీ, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ ఉన్నప్పటికీ పెట్రోల్ చోరీలు ఎలా జరుగుతున్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ట్యాంకర్ల కదలికలను ట్రాక్ చేయడానికి ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ఉన్నా వాటిని సక్రమంగా వినియోగించడం లేదని ఇందులో పెట్రోల్ సంస్థల అధికారుల హస్తం ఉందా.? అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెట్రోల్ సంస్థల నిబంధనలు కేవలం పేపర్‌పైనే ఉన్నాయా.? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ఇక సివిల్ సప్లై, పోలీసుల నిర్లక్ష్యం ఈ మాఫియాకు మరింత బలాన్ని ఇస్తోందని స్థానికులు మండిపడుతున్నారు. పెట్రోల్ వ్యవస్థలో లోపాలు, అధికారుల పర్యవేక్షణ లోపం, కొందరు అధికారుల అవినీతి కారణంగా ఈ దందా విస్తరిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### అధికారులే మౌనం వహిస్తే పరిస్థితి ఏమిటి.?

చట్టాన్ని అమలు చేయాల్సిన వారే కళ్లుమూసుకుని ఉంటే, మాఫియా గుంపులు మరింత దూకుడుగా వ్యవహరించడం సహజమేనని స్థానికులు అంటున్నారు.రహదారుల పక్కనే పెట్రోల్ దొంగతనం జరుగుతుండటం పరిస్థితి ఎంత దారుణంగా ఉందో స్పష్టంగా అర్థమవుతుంది. ప్రజల కళ్లముందే జరుగుతున్న ఈ అక్రమ కార్యకలాపాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అధికార యంత్రాంగంపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తోంది. ఇది కేవలం ఆర్థిక నష్టం మాత్రమే కాకుండా ప్రజల భద్రతా పరమైన ప్రమాదాలను కూడా కలిగించే అంశం.పెట్రోల్ అగ్ని ప్రమాదాలకు గురయ్యే పదార్థాలను అనధికారికంగా నిల్వ చేయడం, దొంగిలించడం, విక్రయించడం వల్ల ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోందని స్థానికులు చేస్తున్నారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే దాని బాధ్యత ఎవరు వహిస్తారు అనే ప్రశ్నలు ప్రజలలో వ్యక్తమవుతున్నాయి.అవినీతి, అక్రమాలను అరికట్టాల్సిన వ్యవస్థలు నిర్లక్ష్యంతో వాటినే పెంచి పోషిస్తున్నాయనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. కొందరు అధికారులు మాఫియాతో కుమ్మక్కై ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లేకపోతే ఇంత బహిరంగంగా జరుగుతున్న దందా ఇప్పటివరకు ఎలా కొనసాగుతోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా సివిల్ సప్లై, పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. పెట్రోల్ మాఫియాపై ప్రత్యేక దృష్టి సారించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించి, సరఫరా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.ఘట్కేసర్, మేడిపల్లి, చర్లపల్లి, మల్లాపూర్ పెట్రోల్ మాఫియా దందాను పూర్తిగా అరికట్టాలంటే కఠినమైన చర్యలు తీసుకోవడం తప్ప మరో మార్గం లేదు. అధికారులు తమ బాధ్యతను గుర్తించి తక్షణమే స్పందిస్తేనే పరిస్థితి అదుపులోకి వచ్చే అవకాశం ఉంది. లేదంటే ఈ మాఫియా మరింత విస్తరించి ప్రజలకు ముప్పుగా మారే ప్రమాదం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# అమెరికా లొంగిపోయేవరకు యుద్ధం కొనసాగుతుంది

- ట్రంప్ వ్యాఖ్యలపై ధీటుగా స్పందించిన ఇరాన్



**టెహ్రాన్ (ప్రశ్న న్యూస్)** అమెరికా తమకు లొంగిపోయేవరకు ఈ యుద్ధం కొనసాగుతుందని ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్ నౌకాదళం, వాయుసేన తీవ్రంగా బలహీనపడ్డాయని, వారి నాయకత్వాన్ని తీవ్రస్థాయిలో దెబ్బతీశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ ధీటుగా స్పందించింది. ట్రంప్ చెప్పినట్లుగా తమ సైనిక సామర్థ్యాలు దెబ్బతినలేదని పేర్కొంది. అమెరికా అవమానానికి గురై, పశ్చాత్తాపపడి, లొంగిపోయే వరకు ఈ యుద్ధం కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ మిలిటరీ కమాండ్ ప్రధాన కేంద్రం అధికార ప్రతినిధి ప్రకటన చేయగా, ఇరాన్ అధికారిక మీడియా ప్రసారం చేసింది. తమ దేశ సైనిక బలం, విస్తృతమైన వ్యూహాత్మక సామర్థ్యాల గురించి అమెరికా నిఘా వర్గాలకు పూర్తి సమాచారం లేదని పేర్కొంది. వ్యూహాత్మక క్షిపణులు, సుదూర లక్ష్యాలను ఛేదించే డ్రోన్లు, అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలు, ప్రత్యేక ఆయుధాల ఉత్పత్తి కేంద్రాలతో పాటు సైనిక మౌలిక సదుపాయాలు ధ్వంసం చేశామని ట్రంప్ చేసిన వాదనలను ఇరాన్ ఖండించింది. అమెరికా రాతి యుగం నాటి నేరాలను ఆధునిక యుగానికి తీసుకువస్తోందని ఆరోపించింది. చిన్నారుల హత్యలు, మానవత్వానికి మచ్చతెచ్చే నేరాలకు పాల్పడుతోందని ఆరోపించింది.

# ఉచిత దర్శనం లేని మైసిగండి దేవాలయం

- అభివృద్ధి పేరుతో ఆలయాన్ని వ్యాపారంగా మార్చేశారా.?
- భక్తులకు చిటికెడు ప్రసాదం పెట్టారు, తాగడానికి నీళ్లు లేవు
- ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం 5 కోట్లు ఇచ్చిన అభివృద్ధి ఎక్కడా.?
- దేవాలయాలను భక్తులకు దూరం చేయడానికేనా ఉచిత దర్శనం తీసేశారు
- దశాబ్దాలుగా పాతుకుపోయిన సిబ్బంది, అధికారుల బదిలీలు ఉండవా.?
- ఎవరి సొంత లాభం కోసం అధికారుల సిబ్బంది బదిలీలు లేవు



**(గౌటి రామకృష్ణ -- ప్రశ్న న్యూస్)**







రంగారెడ్డి జిల్లాలోని కడ్తాల్ మండలంలోని మైసిగండి శ్రీ మైసమ్మ దేవాలయం భక్తి, విశ్వాసానికి నిలయంగా ఉండాల్సిన ఈ పవిత్ర క్షేత్రం ఇప్పుడు నిర్వాహకుల నిర్లక్ష్యం, అధికారుల అజాగ్రత్తతో భక్తుల ఆగ్రహానికి గురవుతుంది. ఎండోమెంట్ అధికారులు కావాలని ఉచిత దర్శనం అందుబాటులో లేకుండా చేసి, భక్తులను చెల్లింపు దర్శనాల వైపు మళ్లీస్తుండడంతో భక్తుల తీవ్ర ఆగ్రహానికి దారి తీస్తోంది. దేవాలయం అంటే వ్యాపారమా.? అంటూ భక్తులు ప్రశ్నిస్తున్నారు.ఉచిత దర్శనం అనుకొని భక్తులు వస్తుంటే ఒక్కసారిగా టికెట్ తీసుకోవాలంటూ సిబ్బంది చెప్పడంతో భక్తులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఉచిత దర్శనం లేదా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఈ ఆలయానికి ప్రతి ఆదివారం విపరీతంగా భక్తులు వస్తారు ఆలయం అభివృద్ధి పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు ఆలయానికి చెందుతున్నాయా.? మరి ఇన్ని సంవత్సరాలుగా భారీ స్థాయిలో భక్తులను అభివృద్ధి పేరుతో పిండి వసూలు చేస్తున్న డబ్బు ఆలయానికి చెందితే ఎందుకు పూర్తిస్థాయిలో అభివృద్ధి కావడం లేదని ప్రభుత్వం ఇచ్చిన నిధులు ఖర్చు చేస్తుంటే మరి పూర్తిస్థాయిలో ఎన్ని సంవత్సరాల నుండి ఎందుకు అభివృద్ధి కాలేదో పాలకులకు, ఉన్నత అధికారులకే తెలియాలి. సామాన్య భక్తులకు పది రూపాయల తో దర్శనం కష్టంగా మారగా, డబ్బున్నవారికి మాత్రం ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు గురవుతోంది.

### కనీస సౌకర్యాలు కరువు..

మైసిగండి ఆలయ ప్రాంగణంలో కనీస సౌకర్యాలు లేకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. వేసవి వేడిలో భక్తులకు తాగునీరు కూడా అందుబాటులో లేకపోవడం దారుణమని భక్తులు అంటున్నారు. మూడు నాలుగు చోట్ల తాగడానికి నీళ్లు ఏర్పాటు చేయకుండా కేవలం ఒక దగ్గర ఏర్పాటు చేసి చేతులు దులుపుకోవడం ఈవో నిర్లక్ష్యమని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాంగణం పరిశుభ్రత పూర్తిగా లోపించడంతో ఎలుకలు, పందికొక్కులు సంచరిస్తున్న దృశ్యాలు భక్తులను కలవరపెడుతున్నాయి. సిబ్బంది అధికారుల నిర్లక్ష్యంతో దేవాలయం పవిత్రత ఎక్కడో మాయమైపోయిందనే భావన కలుగుతోంది.

ప్రభుత్వం ఆలయ అభివృద్ధి కోసం రూ.5 కోట్లు కేటాయించినప్పటికీ, ఆ నిధులు ఎక్కడ వినియోగించారో స్పష్టత లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. అభివృద్ధి పనుల జాడ కనిపించకపోవడంతో ఆ డబ్బు ఎక్కడికి పోయింది.? అనే ప్రశ్నలు భక్తుల్లో ఉత్పన్నమవుతున్నాయి. ఖర్చులపై పారదర్శకత లేకపోవడం, ఎస్టిమేషన్ అధికంగా వేయడం, ఎండోమెంట్ శాఖ పనితీరుపై సందేహాలు రేకెత్తిస్తోంది.

### కమీషనర్ ఆదేశాలు బేఖతార్..

ఎండోమెంట్ శాఖాలో కమిషనర్ ఆదేశాలను ఒక్క ఈవో కూడా అమలు చేయకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. కమిషనర్ ఆదేశాలు అంటేనే చెత్త బుట్ట దాఖలు అన్నట్లుగా మారిపోయింది పరిస్థితి. తెలంగాణ వ్యాప్తంగా దేవాదాయ ధర్మాదాయ శాఖలో ఉన్నప్రతి దేవాలయంలో ప్రతి భక్తునికి ప్రసాదం అందించాలని కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, అవి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శలు వినిపిస్తున్నాయి. మైసిగండి ఆలయంలో ఈవో స్నేహలత కమిషనర్ ఆదేశాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఎంతో భక్తి భావంతో వస్తున్న భక్తులకు కనీసం చిటికెడు ప్రసాదం అందక నిరాశతో వెళ్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

### సిబ్బంది,అధికారుల దురుసు ప్రవర్తన..

ఆలయానికి భక్తితో కొంతమంది, మొక్కులతో కొంతమంది, కష్టాలు తీర్చుకోవడానికి కొంతమంది ఇలా అనేక రకాలుగా భక్తులు వస్తారు. ఇక సిబ్బంది వ్యవహార శైలి, దురుసు ప్రవర్తన, భక్తులను దూషించడం పై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా అదే స్థానాల్లో తిష్ట వేసి





కూర్చున్న అధికారులు, సిబ్బంది తమ స్వప్రయోజనాలకే పరిమితమయ్యారని భక్తుల నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు బదిలీలు లేకపోవడంతో అవినీతి, నిర్లక్ష్యం పూర్తిగా పెరుగుతోందని స్థానికులు అంటున్నారు.

### ఆలయానికి వచ్చే ఆదాయం ఎంత.? ఎటు వెళుతోంది.?

మైసిగండి ఆలయానికి వచ్చే ఆదాయం ఎంత.? అందులో ఎంత మొత్తం ఎండోమెంట్ శాఖకు వెళ్తోంది.? ఎంత మేర ఆలయ అభివృద్ధికి వినియోగం జరుగుతోంది.? అనే అంశాలపై స్పష్టమైన లెక్కలు వెల్లడించకపోవడం మరింత అనుమానాలకు దారి తీస్తోంది. ఆదాయం పెరుగుతున్నప్పటికీ, భక్తులకు సౌకర్యాలు మాత్రం రోజురోజుకు శూన్యంగా ఉండటం విస్మయం కలిగిస్తోంది.ఇలాంటి పరిస్థితుల్లో కూడా దేవాదాయ శాఖ మంత్రి, ఉన్నతాధికారులు చోద్యం చూస్తుండటం, ఆకస్మిక తనిఖీలు చేయకపోవడం తీవ్ర విమర్శలకు గురవుతోంది. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆలయాల పర్యవేక్షణను పూర్తిగా విస్మరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.మొత్తానికి మైసిగండి ఆలయం పరిస్థితి చూస్తే, భక్తి కంటే వ్యాపారమే ప్రాధాన్యంగా మారిందనే భావన కలుగుతోంది. వెంటనే అధికారులు స్పందించి, ఉచిత దర్శనం పునరుద్ధరించడం, పాలనలో పారదర్శకత తీసుకురావడం, భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడం అత్యవసరంగా మారింది. లేకపోతే భక్తుల ఆగ్రహం మరింత ఉధృతమయ్యే అవకాశం ఉంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588